
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 4 ఆగస్టు 2025



క్వారీ కబళించిన

- వలస కూలీల ఉసురు తీసిన గ్రానైట్
- వర్షానికి మట్టి కరిగి పడిన రాయి.. ఆరుగురి సమాధి.. 10 మందికి గాయాలు
- మృతులందరూ ఒడిస్సా వాసులే..

క్వారీలో కోత పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో గ్రానైట్ రాయి కూలీల ఉసురుతీసింది. పొట్టకూటి కోసం ఒడిస్సా నుంచి వచ్చిన కూలీల బతుకులను క్వారీ కబళించేసింది. బల్లికురవ మండలం కొణిదెన రెవెన్యూ పరిధిలోని ఈర్లకొండ వద్ద ఉన్న సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో ఒడిస్సాకు చెందిన 16 మంది కూలీలు ఆదివారం పని చేస్తున్నారు. అయితే శనివారం కురిసిన వర్షానికి క్వారీ ఎగువ భాగం ఉన్న రాయి కింద మట్టి కరిగి పోయింది. అయితే దీనిని గమనించిన కూలీలు పనులు చేస్తుండగా ఆ గ్రానైట్ రాయి వారిపై పడింది. దీంతో నలుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా, నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు కూలీలు మృతి చెందారు.


ప్రమాదం జరిగిన గ్రానైట్ క్వారీ

స్నేహితుల దినోత్సవం రోజున విషాదం

భాస్కర్ భిష్ణోయ్, టకున దలాయ్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఒడిస్సా నుంచి క్వారీలో పనికి కూడా ఇద్దరు కలిసే వచ్చారు. కలిసి వచ్చిన స్నేహితులు స్నేహితుల దినోత్సవం రోజు కలిసి మృతి చెందడంతో స్థానికంగా విషాదం అలుముకుంది.

బల్లికురవ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సాలోని గంజాం జిల్లా చస్సనిమ్మకాడి గ్రామానికి చెందిన దండ బడత్య(48), కసాయ్ గ్రామానికి చెందిన సంతోష్‌గౌడ(36), దుగాన్ గ్రామానికి చెందిన ముస్సాజన(43), గజపతి జిల్లా చాందిపుట్ గ్రామానికి చెందిన టుకున దలాయ్(37), పసిగూడ గ్రామానికి చెందిన బనమల బెహ్రా(30), చాందిపుట్ గ్రామానికి చెందిన భాస్కర్ భిష్ణోయ్ (40)లు మృతి చెందారు. గాయపడిన సుదర్శన్, అలోక్‌నాయక్, శిరాగౌడ, మహేంద్ర బెహ్రా, వెంకయ్య, సుభాష్‌మాలిక్, పవిత్ర బెహ్రా, దంబాలతో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. వీరిలో ఆలోక్ నాయక్, శివగౌడ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. క్వారీ ప్రమాదంపై మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూలీల కుటుంబాలను ఆదుకుంటామన్నారు.

సీఎం ఆదేశాలతో కదిలిన అధికారులు

క్వారీలో ప్రమాదం జరిగిన (మిగతా 7లో)


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ


నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో చంద్రశేఖరనాయుడు


స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్న వారి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసు


ప్రత్యేక అలంకరణలో బగళాముఖి అమ్మవారు

బగళాముఖికి ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా శ్రీబగళాముఖి అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చిన ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులను అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని పోతనకట్టవారిపాలెం పంచాయతీ పుచ్చకుర్తివారిపాలెం, యేమినేనివారిపాలెం గ్రామాలకు చెందిన మహిళా భక్తులు, గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేకంగా పసుపుకుంకుమలు సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి, పోతనకట్టవారిపాలెం సర్పంచ్ యేమినేని పార్వతి, వై.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు

సూర్యలంకలో సందడి

బాపట్ల, బాపట్ల రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆదివారం బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో పర్యాటకుల సందడి నెలకొంది. హైదరాబాద్, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు సూర్యలంక తీరానికి ఉదయాన్నే చేరుకుని స్నానాలను ఆచరించారు. యువకులు కేరింతలు కొడుతూ, చిన్నారులు ఇసుక తెన్నెల్లో ఆడుకుంటూ సరదాగా గడిపారు. పర్యాటకులు కుటుంబ సభ్యులతో సమీప జీడిమామిడి తోటల కింద భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. భారీగా పర్యాటకులు రావడంతో మెరైన్, రూరల్ పోలీసులు గస్తీ నిర్వహించారు.

జర్నలిజం అంతిమ ప్రయోజనం.. సమాజ సంక్షేమం
- ప్రెస్ అకాడమీ చైర్మన్ సురేష్‌కుమార్

చర్చి కమిటీ నిధుల విషయంలో ఘర్షణ
జమా ఖర్చులు కోరిన టీడీపీ సభ్యులపై దాడి

వృద్ధురాలిపై దాడి.. బంగారం అపహరణ

బాల్ బ్యాడ్మింటన్ గుంటూరు జిల్లా జట్ల ఎంపిక

7

తడిసి మోపెడు

- కాల్వల్లో నీళ్లున్నా సాగు సంకటం
- ఆయిల్ ఇంజన్లతో పంటలకు నీటితడులు

కొల్లూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాల్వల్లో నీళ్లన్నా పంట పొలాలకు అందని పరిస్థితి. జలాశయాల్లో పుష్కలంగా నీరున్నా సాగు నీటి కోసం అదనంగా భారం మోయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. వరుణిడి కినుకతో కాల్వలకు విడుదలవుతోన్న నీటిపై ఆధారపడి కొల్లూరు మండలంలోని రైతులు వెద పద్ధతిలో సాగుకు శ్రీకారం చుట్టారు. ఇటీవల వాయుగుండం ప్రభావంతో ఓ మోస్తరు వర్షాలు కురిసినా ఆ తర్వాత విపరీతమైన ఎండలతో సాగు భూముల్లోని తడి ఆవిరై పంట పొలాలన్నీ బీటలు వారాయి. సీజన్ ప్రారంభం నుంచే వెదపైరుకు నీటి తడుల కోసం రైతులు విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్లపై ఆధారపడ్డారు. తదనంతరం కాల్వలకు సాగునీరు విడుదల చేశారు. అయితే సరిపడ నీటి పరిమాణం కాల్వల్లో లేకపోవడంతో రైతులు ఆయిల్ ఇంజన్లు, ట్యూబుల సహాయంతో పైరుకు నీటి తడులు అందించుకోవాల్సి వచ్చింది. ఆయిల్ ఇంజన్ల ద్వారా అందిస్తున్న తడులు కొద్ది గంటల్లోనే గాలులకు ఆవిరైపోతున్నాయి. దీంతో పొలాల్లో నీరు లేక నెర్రెలిస్తున్నాయి. దీని వల్ల రైతులపై ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి తడుల కోసం అదనపు వ్యయభారం పడుతోంది. ఈ పరిణామాలతో ఈ ఏడాది సాగు వ్యయం పెరిగిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు కాల్వల వెంబడి తిరిగి నీటి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.


నీళ్లు అందక నెర్రెలిచ్చిన వరి పొలం


పంట కాల్వల్లో నీటిని ఆయిల్ ఇంజన్, ట్యూబుల సాయంతో నీటి తడులు అందిస్తున్న దృశ్యం


రూ.9 వేల కోట్లతో రైల్వే, హైవే ప్రాజెక్టులు

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



బాపట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రైల్వే, హైవే ప్రాజెక్టులకు రూ.9 వేల కోట్లు మంజూరైనట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో చేసిన ప్రతిపాదనల మేరకు రాజధాని అమరావతి నుంచి ఎన్‌హెచ్ 16, ఎన్‌హెచ్ 216 కలుపుతూ నిజాంపట్నం హార్బర్ వరకు నాలుగు వరుసలరోడ్డు నిర్మాణానికి రూ.1600 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. జిల్లా మీదగా వెళ్లే 216 జాతీయ రహదారిని నాలుగు వరుసల్లో అభివృద్ధికి రూ.2,200 కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు. జీబీసీ రోడ్డును హైవేరోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరామన్నారు. రైల్వేకు సంబంధించి వేమూరు నియోజకవర్గ పరిధిలో ఐదు ఆర్వోబీల నిర్మాణానికి రూ.317 కోట్లు మంజూరయ్యాయన్నారు. జిల్లాలో మరో ఐదు ఆర్వోబీలకు ప్రతిపాదనలు రూపొందించామన్నారు. మూడు లేన్లలో ఉన్న రైల్వే మార్గాన్ని నాలుగు లేన్లకు విస్తరించాలని ప్రతిపాదించగా రైల్వేమంత్రి అంగీకరించారన్నారు. రేపల్లె నుంచి తెనాలికి రెండో లేన్ నిర్మాణం రూ.1400 కోట్లతో త్వరలో కార్యరూపం దాల్చనుందన్నారు. బాపట్ల, చీరాల స్టేషన్లలో పలు రైళ్ల నిలుపుదలకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. టూరిజం, ఆక్వా, హ్యాండ్‌లూమ్ ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర మంత్రులకు వివరాలు అందజేశామన్నారు.

6 రోజులు.. 106 టీఎంసీలు



- సాగర్ నుంచి ఇప్పటి వరకు నీటి విడుదల
- జలాశయానికి తగ్గిన వరద..
- డ్యాం గేట్లు మూత జలశోయగాలను వీక్షించేందుకు వచ్చిన పర్యాటకుల నిరాశ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పరవళ్లు తొక్కుతూ ప్రవహించిన కృష్ణమ్మ శాంతించింది. శ్రీశైలం నుంచి నీటి విడుదల ఆగడంతో దిగువకు ప్రవాహం తగ్గింది. ఆదివారం నాగార్జున సాగర్ జలాశయానికి వరద ప్రవాహం తగ్గడంతో డ్యాం క్రస్ట్ గేట్లను మూసివేశారు. అయితే సాగర్ జలాశయం నుంచి గత కొన్ని రోజులుగా నీటి విడుదల చేస్తుండటంతో జల శోయగాలను వీక్షించేందుకు సెలవు రోజైన ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. అయితే డ్యాం గేట్లు మూసేయడంతో వారంతా నిరుత్సాహానికి లోనయ్యారు. గత నెల 29న డ్యాం క్రస్ట్ గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. జూలై నెలలో 18 ఏళ్లలో నీటి విడుదల చేయడం ఇదే ప్రథమం కావడంతో పలువురు విశేషంగా వ్యాఖ్యానించారు. ఆరు రోజులు సాగర్ జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. మొత్తం 106 టీఎంసీల నీరు డ్యాం నుంచి పులిచింతలకు విడుదల చేసినట్లు జలవనరులశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి.

ఇన్‌ఫ్లో 47,714 క్యూసెక్కులు..

ఆదివారం సాగర్ జలాశయంలోకి 47,714 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 28,988, జవహర్ కుడి కాల్వకు 8,604, ఎడమ కాల్వకు 8,022 మొత్తంగా 47,714 క్యూసెక్కుల నీటిని ఆదివారం డ్యాం నుంచి విడుదల చేశారు. నీటి మట్టం 590 అడుగులకు 585.8 అడుగులు ఉంది. పూర్తి సామర్థ్యం 312.05 టీఎంసీలకు 299.74 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

పులిచింతల నుంచి ఆగిన ప్రవాహం

పులిచింతల జలాశయానికి ఆదివారం నీటి ప్రవాహం తగ్గింది. దీంతో డ్యాం గేట్లు బంద్ చేసి నీటి విడుదలను నిలిపివేశారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 18,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. 21,131 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వస్తుండగా అదేస్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. జలాశయంలో 175 అడుగులకు 172.63 అడుగుల నీటి మట్టం ఉంది. పూర్తి సామర్థ్యం 45.77 టీఎంసీలకు 42.18 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

కాటాతో.. కనికట్టు

హుక్ కాటాలతో రేషన్ పంపిణీ పక్కదారి

- బియ్యాన్ని బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తోన్న డీలర్లు
- గతంలో ఎండీయూల వద్ద ఉన్న కాటాల వినియోగం



బాపట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో పౌరసరఫరాల శాఖ ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు అమలు చేస్తోన్నా అందుకు విరుగుడుని కొంతమంది డీలర్లు ఇట్టే కనుగొంటున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు సరుకులు డోర్ డెలివరీ చేసేందుకు ఈ-పోస్ పరికరం, బ్లూటూత్ ఎలక్ట్రానిక్ కాటా కనెక్టివిటీని తొలుత తొలగించారు. ఇదే అదునుగా చాలామంది డీలర్లు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు ఈ-పోస్ పరికరంతో వెళ్లి వేలిముద్రలు వేయించి బియ్యానికి బదులుగా కేజీకి రూ.13 నుంచి రూ.14 చొప్పున లెక్క కట్టి చేతిలో పెట్టి ఆ బియ్యాన్ని మాఫియాకు చేరవేసి లబ్ధి పొందారు. ఈ నేపథ్యంలో బ్లూ టూత్ కనెక్టివిటీని పౌరసరఫరాల శాఖ ఈ నెల ఒకటో తేదీ నుంచి తిరిగి అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం డీలర్లు డోర్ డెలివరి చేయడానికి వెళ్లినప్పుడు ఈ-పోస్ డివైస్, బ్లూ టూత్ సదుపాయం కలిగిన ఎలక్ట్రానిక్ కాటా, సరుకులు తీసుకువెళ్లాలి. అయితే ఇంటింటికి ఎలక్ట్రానిక్ కాటాని తీసుకెళ్లడం సాధ్యపడే వ్యవహారం కాదు. ఈ నేపథ్యంలో గతంలో ఎండీయూల వద్ద ఉన్న బ్లూటూత్ సదుపాయం కలిగిన ఎలక్ట్రానిక్ కాటా హుక్(చాలా తేలికగా ఉంటుంది)ని తీసుకెళ్లి వేలిముద్రలు వేయించి బియ్యానికి బదులు నగదు ఇచ్చి లబ్ధి పొందుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి కాస్త కట్టుదిట్టం చేయడంతో దాని ప్రభావం రేషన్ పంపిణీపై పడింది. ఇతర జిల్లాల్లో 40 నుంచి 50 శాతం పైగా పంపిణీ ఇప్పటికే పూర్తి కాగా గుంటూరు జిల్లాలో ఉన్న 972 రేషన్ దుకాణాల్లో శనివారం సాయంత్రం వరకు లక్షా 63 వేల 380 మందికి(27.71 శాతం)మాత్రమే రేషన్ సరుకులు సరఫరా చేయగలిగారు. ఇందులోనూ (మిగతా 7లో)

గత నెలలో ఇష్టారాజ్యం..

గత నెలలో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా డిపో పరిధిలో ఐదు నుంచి 10 శాతం మించి పోర్టబిలిటీ కార్డులకు రేషన్ సరుకులు ఇవ్వరాదు. అయితే జూలైలో కొన్ని షాపుల పరిధిలో 60 శాతం పోర్టబిలిటీ కార్డులకు రేషన్ ఇచ్చారు. దీని వల్ల కొంతమంది డీలర్ల వద్ద సరుకుల నిల్వ అసలు తగ్గలేదు. కొందరి షాపుల్లో సరుకులు అయిపోయాయి. ఇలా జరగ డానికి ప్రధాన కారణం పోర్టబిలిటీపై ఆంక్షలు లేకపోవ డమే. అలానే 65 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులు, దివ్యాం గులకు ప్రతీ నెల రేషన్ సరుకులు ముందు నెల 26వ తేదీ నుంచే పంపిణీ చేస్తున్నారు. ఆ నాలుగైదు రోజులు ఈ- పోస్ డివైస్‌తో బ్లూ టూత్ ఎలక్ట్రానిక్ కాటా లింకుని తొలగిస్తున్నారు. ఇదే అదనుగా ఆ నాలుగు రోజుల్లోనే ఎక్కువ కార్డులను ఈ-పోస్‌లో కొట్టేస్తున్నారు.

దిక్సూచి



క్యాట్ 2025

దేశంలోని ప్రీమియర్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో అడ్మిషన్‌కు ఉద్దేశించిన 'కామన్ అడ్మిషన్ టెస్ట్'(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఈ ఎంట్రెన్స్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎమ్) మాత్రమే కాకుండా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ-ఢిల్లీ, కోల్‌కతా), ఐఐటీల్లోని ఎంబీఏ కోర్సులు, టాప్ బిజినెస్ స్కూల్స్‌లో అడ్మిషన్ల కోసం కూడా ఉపయోగపడుతుంది. దేశ వ్యాప్తంగా 170 నగరాల్లో ఈ ఎంట్రెన్స్‌ను నిర్వహించనున్నారు. మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ ఎంట్రెన్స్‌కు గత సంవత్సరం 2.93 లక్షల మంది హాజరయ్యారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ పాసైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులకు 45 శాతం చాలు.

పరీక్ష విధానం: గత సంవత్సరం ప్రశ్నపత్రం ఇలా ఉంది. మొత్తం మార్కులు 204. మొత్తం ప్రశ్నలు 68. ఇందులో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 48, నాన్ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 20. ప్రతీ విభాగానికి 40 నిమిషాల చొప్పున మొత్తం సమయం రెండు గంటలు ఉంటుంది. ఎంసీక్యూలకు మాత్రం నెగెటివ్ మార్కులు ఉంటాయి. నాన్ ఎంసిక్యూలకు నెగెటివ్ మార్కులు లేవు.

- వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్ - 24 ప్రశ్నలు
- డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ - 22 ప్రశ్నలు
- క్వాంటిటేటివ్ ఎబిలిటీ - 22 ప్రశ్నలు

ఈ సంవత్సరం కూడా పెద్దగా మార్పులు లేకుండా ఇలాగే ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు సిద్ధం అయితే మంచిది.

ప్రిపరేషన్ టిప్స్: భారతదేశంలో అత్యంత పోటీ ఉన్న పరీక్షల్లో 'క్యాట్ ఎంట్రెన్స్' ఒకటి. వంద పర్సంటైల్ ఉన్నవారికి కూడా అహ్మదాబాద్‌లోని ఐఐఎంలో సీటు వస్తుందన్న గ్యారంటీ లేదు. సీటు సాధించడంలో పర్సంటైల్‌తోపాటు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే పరీక్షలో మంచి మార్కులు వస్తేనే ఆ దశకు చేరుకోగలుగుతారు. అందుకోసం కొన్ని మెలకువలను పాటించాలి.

టైమ్ మేనేజ్‌మెంట్: క్యాట్ ప్రిపరేషన్‌లో ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం ఇది. ప్రతీ సెక్షన్ సమాధానాలను 40 నిమిషాల్లో పూర్తిచేయాలి. అందుకోసం ప్రిపరేషన్ సమయంలో స్పీడ్, ఆక్యురసీపై బాగా దృష్టిపెట్టాలి.

షార్ట్‌కట్ టెక్నిక్: నిర్ణీత సమయంలో సమాధానాలు గుర్తించాలంటే షార్ట్‌కట్ పద్ధతులు అనుసరించాల్సిందే. ప్రిపరేషన్ సమయంలో మెంటార్లు చెప్పే మెలకువలను బాగా గుర్తుంచుకుని పాటించాలి. ముఖ్యమైన వాటిని ఒక దగ్గర రాసుకుని తరచుగా రివ్యూ చేసుకుంటూ ఉండాలి.

గత ప్రశ్నపత్రాలు సాల్వ్ చేయడం: గత సంవత్సరాల ప్రశ్న పత్రాలను సాల్వ్ చేయడం ద్వారా డిఫికల్టీ లెవెల్ బాగా అర్థం అవుతుంది. అలాగే మాక్‌టెస్ట్‌లు రాయడం వల్ల నిర్ణీత సమయంలో సాల్వ్ చేయగలుగుతున్నారా లేదా అనేది చెక్ చేసుకోగలుగుతారు. అలాగే తమ బలాలు, బలహీనతలు తెలుస్తాయి.

- క్యాట్‌లో మరో ముఖ్యమైన విషయం ఏమంటే చాయిస్ ఆఫ్ క్వశ్చన్స్. అటెంప్ట్ చేయకముందే దానిని పూర్తి చేయగలం అనే నమ్మకం ఉన్నప్పుడు మాత్రమే దానిని సాల్వ్ చేయడానికి ప్రయత్నించాలి.
- వొకాబులరీ, రీడింగ్ స్కిల్స్ మెరుగు పరుచుకోవడానికి పుస్తకాలు, దినపత్రికలు, అందులోని ఎడిటోరియల్స్, జర్నల్స్ క్రమం తప్పకుండా చదవాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 13
పరీక్ష తేదీ: 2025 నవంబర్ 30
ఫలితాలు: 2026 జనవరి మొదటి వారం
వెబ్‌సైట్: https://iimcat.ac.in

ఐబీపీఎస్‌లో 10,277 క్లర్క్ పోస్టులు

క్లర్క్ పోస్టుల భర్తీకి 'ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్'(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో క్లర్క్ పోస్టులను భర్తీ చేస్తారు. మొత్తం 10,277 పోస్టులు ఉన్నాయి. ఇందులో తెలంగాణలో 261, ఆంధ్రప్రదేశ్‌లో 367 ఖాళీలు ఉన్నాయి. ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు ఐబీపీఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. కంప్యూటర్‌లో సర్టిఫికెట్/ డిప్లొమా/ డిగ్రీ సర్టిఫికెట్ లేదా స్కూలు, కాలేజీలో కంప్యూటర్ సబ్జెక్ట్ అయినా ఉండాలి. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల ద్వారా ఎంపిక జరుగుతుంది. స్థానిక భాషలో రాయడం, చదవడం వచ్చి ఉండాలి.

పరీక్ష విధానం: ప్రిలిమినరీ ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది. 60 నిమిషాల వ్యవధిలో వంద ప్రశ్నలకు సమాధానాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటికి వంద మార్కులు ఉంటాయి.

ఇంగ్లిషు	30 ప్రశ్నలు	30 మార్కులు	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు

ఇందులో అర్హత సాధించిన వారికి మెయిన్ పరీక్షకు పిలుస్తారు. ఇది కూడా ఆబ్జెక్టివ్ పరీక్షనే. ఇక్కడ 200 మార్కులు 155 ప్రశ్నలు ఉంటాయి. వీటికి రెండు గంటల్లో సమాధానాలు గుర్తించాలి.

జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్	40 ప్రశ్నలు	50 మార్కులు	20 నిమిసాలు
జనరల్ ఇంగ్లిష్	40 ప్రశ్నలు	40 మార్కులు	35 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	40 ప్రశ్నలు	60 మార్కులు	35 నిమిషాలు
క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్	35 ప్రశ్నలు	50 మార్కులు	30 నిమిషాలు

వయస్సు: అభ్యర్థుల వయస్సు 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1997 ఆగస్టు 2 నుంచి 2005 ఆగస్టు1 లోపు జన్మించి ఉండాలి(రెండు తేదీలను కలుపుకొని). ఎస్సీ/ఎస్టీలకు ఐదు సంవత్సరాలు, ఓబీసీలకు మూడు సంవత్సరాలు, దివ్యాంగులకు పది సంవత్సరాలు, వితంతువులు/ విడాకులు పొందిన మహిళలు 35 సంవత్సరాల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మాజీ మిలిటరీ ఉద్యోగులకు నిబంధనలు అనుసరించి సడలింపు ఉంటుంది.

ఖాళీలు ఉన్న బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

దరఖాస్తు ఫీజు: రూ.850/-. ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ/ ఈఎస్ఎమ్/డీఈఎస్ఎమ్ అభ్యర్థులకు రూ.175/-.
ప్రిలిమినరీ పరీక్ష: 2025 అక్టోబర్
మెయిన్స్ పరీక్ష: 2025 నవంబర్
చివరి తేదీ: 2025 ఆగస్టు 21
వెబ్‌సైట్: ibps.in

జాబ్ కార్నర్

పదో తరగతితో ఐబీలో..

మొత్తం ఖాళీలు 4,987

కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)లో దేశవ్యాప్తంగా 4987 సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇందులో తెలంగాణకు 117 పోస్టులు, ఆంధ్రప్రదేశ్‌కు 115 పోస్టులు ఉన్నాయి.

అర్హత: పదో తరగతి పాసై ఉండాలి. దరఖాస్తు చేసిన రాష్ట్రానికి సంబంధించిన నివాస ధృవీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. స్థానిక భాష రాయడం, మాట్లాడడం, చదవడం వచ్చి ఉండాలి. ఇంటెలిజెన్స్ ఫీల్డ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

వయస్సు: 2025 ఆగస్టు 17 నాటికి 18-27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు వయో పరిమితిలో మూడేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం:

టైర్-1: వంద మార్కులకు ఆబ్జెక్టివ్ టెస్ట్ ఉంటుంది. 60 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాలి. ఇందులో జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, న్యూమరికల్/అనలిటికల్, లాజికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్, ఇంగ్లిష్ నుంచి ప్రశ్నలు వస్తాయి. నెగెటివ్ మార్కింగ్ ఉంది.

టైర్-2: యాభై మార్కులకు భాషా అనువాదం డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటుంది. వ్యవధి ఒక గంట. ఇది క్వాలిఫైయింగ్ టెస్ట్ మాత్రమే.

టైర్-3: ఇంటర్వ్యూ యాభై మార్కులకు ఉంటుంది.

చివరి తేదీ: ఆగస్టు 17
వెబ్‌సైట్: www.mha.gov.in/en

ఎయిమ్స్ & ఇతర సంస్థల్లో..

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)తోపాటు, ఇతర జాతీయ వైద్య సంస్థల్లో నర్సింగ్ పోస్టుల భర్తీ జరగనుంది. ఎయిమ్స్, జిప్మర్, ఈఎస్ఐసీల్లోని ఖాళీలను ఈ నోటిఫికేషన్ ద్వారా నింపనున్నారు.

అర్హత: బీఎస్సీ నర్సింగ్ / పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎంతోపాటు, కనీసం 50 పడకల ఆస్పత్రిలో రెండేళ్ల పని అనుభవం.

వయస్సు: అభ్యర్థుల వయస్సు 30 సంవత్సరాల లోపు ఉండాలి. రిజర్వేషన్‌లను బట్టి సడలింపు ఉంటుంది.

చివరి తేదీ: 2025 ఆగస్టు 11
పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్14న స్టేజ్-1 పరీక్ష, 2025 సెప్టెంబర్ 27 స్టేజ్-2 పరీక్ష.
వెబ్‌సైట్: www.aiimsexams.ac.in

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నాకు గొప్ప పేరు తెచ్చిన చిత్రమిది

- సత్యదేవ్



'కింగ్‌డమ్' సినిమా మొదటి ఆట చూసినప్పటి నుంచి ప్రేక్షకులు, స్నేహితులు ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. నటుడిగా నాకు గొప్ప పేరు తెచ్చిన చిత్రమిది' అని సత్యదేవ్ అన్నారు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. ప్రేక్షకాదరణతో కొనసాగుతోన్న సందర్భంగా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన సత్యదేవ్ మీడియాతో మాట్లాడారు. 'శివ పాత్ర కోసం దర్శకుడు గౌతమ్ మొదట నా పేరే రాసుకున్నారట. కథ నచ్చి వెంటనే ఓకే చెప్పాను. యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వాలంటే దాని వెనుక బలమైన ఎమోషన్ ఉండాలని నేను నమ్ముతాను. 'కింగ్‌డమ్'లో అలాంటి ఎమోషన్ ఉంది కాబట్టే నా యాక్షన్ సీన్స్‌కి అంత మంచి స్పందన వస్తోంది. ప్రీ క్లయిమాక్స్ ఎపిసోడ్ కోసం చాలా కష్టపడ్డాం. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూశాక..ఆ కష్టమంతా మరచిపోయాను' అని సత్యదేవ్ చెప్పారు.

వేతన పెంపు లేకుంటే షూటింగ్స్ బంద్

- ఫిల్మ్ ఫెడరేషన్ నిర్ణయం

వేతనాలు పెంచేవరకూ 24 కార్మిక సంఘాలు షూటింగ్స్‌లో పాల్గొనకూడదని టాలీవుడ్ ఫిల్మ్ ఫెడరేషన్ నిర్ణయం తీసుకుంది. ఫిల్మ్ ఛాంబర్, ఫిల్మ్ ఫెడరేషన్‌కు మధ్య జరుగుతున్న చర్చలు విఫలం కావడంతో ఫెడరేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. వేతనాల పెంపు డిమాండ్‌పై చర్చించేందుకు ఆదివారం ఫిల్మ్ ఫెడరేషన్ సర్వసభ్యసమావేశం నిర్వహించింది. ఇందులో తీసుకున్న కీలక నిర్ణయాలను ఫెడరేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. నేటి (ఆగస్టు 04) నుంచి 30 శాతం వేతనాలు పెంచుతామని హామీ పత్రం ఇచ్చిన నిర్మాతల షూటింగ్స్‌కు మాత్రమే వెళ్లాలి, వేతనాల పెంపు అమలు చేయని సినిమాల షూటింగ్స్‌కు వెళ్లకూడదని తీర్మానించింది. పెంచిన వేతనాలను ఏ రోజుకారోజే చెల్లించే విధానం అమలు చేయాలనీ, ఫెడరేషన్ ద్వారా యూనియన్లకు తెలియజేసిన తర్వాతనే షూటింగ్స్‌లో పాల్గొనాలని 24 కార్మిక సంఘాలకు తెలిపింది.

కనీస వేతనాల కంటే ఎక్కువే ఇస్తున్నాం

ఫెడరేషన్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఫిల్మ్ ఛాంబర్ స్పందించింది. 'ఫెడరేషన్ పక్షపాతంతో 30 శాతం వేతనాల పెంపును డిమాండ్ చేస్తోంది. ప్రస్తుత చట్టాల ప్రకారం నైపుణ్యం ఉన్నవారికి, లేనివారికి కనీస వేతనాల కంటే ఎక్కువే ఇస్తున్నాం. ఈ సమ్మె నిర్ణయం నిర్మాణంలో ఉన్న చిత్రాలకు భారీ నష్టాన్ని కలిగిస్తుంది. ఫెడరేషన్‌తో కలసి పనిచేస్తున్న మనం ఈ నిర్ణయాన్ని ఖండిస్తున్నాం. ఈ సమస్యకు స్థిరమైన పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్చిస్తాం. అంతవరకూ నిర్మాతలు ఎలాంటి స్వతంత్ర చర్యలు గానీ సంఘాలతో ప్రత్యేక ఒప్పందాలు గానీ చేసుకోకుండా ఛాంబర్ మార్గదర్శకాలను అనుసరించాలని కోరుతున్నాం. శాశ్వత పరిష్కారం కోసం, మెరుగైన భవిష్యత్తు కోసం ఐక్యతతో ఉండాలి. మరిన్ని వివరాలు త్వరలోనే ప్రకటిస్తాం' అని ఫిల్మ్ ఛాంబర్ పేర్కొంది.

ఈ సినిమాను పవన్ చూడాలి

- నిర్మాత అల్లు అరవింద్



'మా కుటుంబంలో, సన్నిహితులు, పరిచయం ఉన్నవారందరిలో సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ఆయన సనాతన ధర్మం గురించి ప్రసంగిస్తే అందరూ ముగ్ధులవుతారు. 'మహావతార్ నరసింహ' సినిమాని ఆయన చూడాలని, దాని గురించి మాట్లాడాలని కోరుకుంటున్నా' అని అన్నారు నిర్మాత అల్లు అరవింద్. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించిన 'మహావతార్ నరసింహ' సినిమా ఇటీవలె విడుదలై మంచి ప్రేక్షకాదరణతో థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ 'భారతదేశమంతటా ప్రేక్షకులు ఈ సినిమాకు జేజేలు పలుకుతున్నారు. హైదరాబాద్‌లోని ఏఎంబీలో 200 మంది స్వాములు ఈ చిత్రాన్ని చూడటం నాకు చాలా ఆనందంగా అనిపించింది' అని అన్నారు.

నవ్వుల పండగ



కన్నడనాట ఇటీవలె విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న చిత్రం 'సు ఫ్రమ్ సో'. తాజాగా ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. ఈనెల 8న మైత్రీ మూవీమేకర్స్ విడుదల చేస్తోంది. జేపీ తుమినాడ్ కథానాయకుడిగా నటించి దర్శకత్వం వహించారు. షనీల్ గౌతమ్, సంధ్య అరకెరె ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్.బి.శెట్టి, శశిధర్ శెట్టి బరోడా, రవిరాయ్ కలస నిర్మించారు. ఆసక్తికరమైన కథ, కథనంతో నిండిన ఈ చిత్రం ప్రేక్షకులకు నవ్వుల పండగను అందిస్తుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేశారు.

యువతా నీ గమ్యం ఎటు వైపు?



హీరో కృష్ణసాయి కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'డేంజర్'. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 'ఓ యువతా నీ గమ్యం ఎటు వైపు? అంటూ సందేశాత్మకంగా సాగే గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు మా బాధ్యతగా డ్రగ్స్‌పై ఓ చైతన్యవంతమైన గీతాన్ని రూపొందించాం. మా ప్రయత్నాన్ని గవర్నర్లు, పోలీస్ అధికారులు ప్రశంసించారు. ఈ సినిమా ప్రజలను ప్రభావితం చేస్తుంది. యువతలో మార్పు తీసుకొస్తుందనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

కొరియోగ్రాఫర్ కృష్ణపై పోక్సో కేసు

టాలీవుడ్‌లో మరో లైంగిక ఆరోపణల కేసు నమోదైంది. మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడన్న ఆరోపణలపై కొరియోగ్రాఫర్ కృష్ణ మాస్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం ఓ పెళ్లయిన మహిళతో కృష్ణ మాస్టర్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనీ, ఈ క్రమంలో ఆమె కూతురిపై కూడా కృష్ణ లైంగిక దాడి చేశాడంటూ సదరు మహిళ జూలై 9న ఫిర్యాదు చేశారు. దీంతో గచ్చిబౌలి పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

ముగింపును మార్చడం నన్ను బాధించింది

- ధనుష్



ధనుష్ కథానాయకుడిగా ఆనంద్.ఎల్.రాయ్ తెరకెక్కించిన 'రాంఝనా' 2013లో విడుదలై సంచలన విజయం సాధించింది. ఇందులోని పాటలు, భావోద్వేగాలు అందరినీ ఆకట్టుకోగా, ముగింపు చాలా మందిని కంటతడి పెట్టించింది. ఇటీవలె ఈ సినిమాను తమిళనాడులో రీ రిలీజ్ చేశారు. అయితే, ఏఐ సాయంతో ఇందులోని క్లైమాక్స్‌ను నిర్మాతలు మార్చారు. 2013లో విడుదలైన ఒరిజినల్ వెర్షన్ ముగింపులో తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరిన హీరో చికిత్స తీసుకుంటూ చనిపోతాడు. అయితే, కొత్తగా విడుదల చేసిన వెర్షన్‌లో హీరో కోలుకున్నట్టు చూపించారు. దీనిపై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వెర్షన్ చూసిన ఫ్యాన్స్ కొందరు ఆనందం వ్యక్తం చేస్తుండగా, దీనిపై ధనుష్, ఆనంద్.ఎల్.రాయ్‌తో పాటు మరికొందరు అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఈ సినిమా ముగింపును మార్చడం నన్ను కలచివేసింది. క్లైమాక్స్ మార్పు, సినిమా ఆత్మను దెబ్బతీసింది. నేను వద్దంటున్నా ఈ రీ రిలీజ్‌కు ముందుకెళ్లారు. 12 ఏళ్ల క్రితం నేను చేసిన సినిమా ఇది కాదు. ఇలా ఏఐతో సినిమా కంటెంట్‌ను మార్చడం కళతో పాటు కళాకారులకు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి పనులు కథ చెప్పే విధానానికీ, సినిమా వారసత్వానికీ ప్రమాదకరం. భవిష్యత్తులో ఇలాంటివి మరోసారి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నాను' అని ధనుష్ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇలా కృత్రిమ మేధ సాయంతో సినిమా కంటెంట్‌ను మార్చే ప్రయత్నం అర్థరహితమైంది. 12 ఏళ్లుగా ఈ సినిమాను తమ హృదయాల్లో పదిలంగా దాచుకున్న అభిమానుల నమ్మకాన్ని వమ్ము చేయడమే' అని ఆనంద్.ఎల్.రాయ్ విమర్శించారు.

అలరించే కామెడీ థ్రిల్లర్



ప్రవీణ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్ జే శివ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటించారు. లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో హీరో సుధీర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 'ప్రవీణ్ ఈ సినిమాతో హీరోగా మారుతున్నందుకు సంతోషంగా ఉంది. 'బకాసురు రెస్టారెంట్' ఘన విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. ప్రవీణ్ మాట్లాడుతూ 'నా మీద నమ్మకంతో హీరోగా పెట్టి సినిమా తీసిన మా దర్శక నిర్మాతలకు నా ధన్యవాదాలు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం ఇది' అని చెప్పారు. దర్శకుడు ఎస్‌జే శివ మాట్లాడుతూ 'ఈ సినిమా ఆద్యంతం ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది' అని అన్నారు.

ఊరిస్తోన్న.. మిర్చి మార్కెటు!

- మార్కెట్ అన్ సీజన్‌లో జోరుగా మిర్చి విక్రయాలు
- 40 రోజుల్లోనే 20 లక్షల మిర్చి టిక్కీల అమ్మకం
- కోల్డ్ స్టోరేజుల్లో 45 లక్షల బస్తాల నిల్వలు
- ధరలు పెరిగే అవకాశం ఉందని అంచనా

గుంటూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా నష్టాల ఊబిలో కూరుకుపోయిన మిర్చి రైతులకు.. ప్రస్తుతం మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు కొత్త ఆశలను రేకెత్తిస్తోన్నాయి. ఎప్పుడూ లేని విధంగా మిర్చి సీజన్ ముగిసిన తర్వాత రోజుకు 50 వేల టిక్కీల విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో రాబోయే మూడు నాలుగు నెలలు ధరలు పెరిగి, స్థిరంగా కొనసాగడానికి అవకాశాలున్నట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒకపక్క కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వలు తగ్గిపోతున్నాయి. మరోవైపు కొత్త పంట విస్తీర్ణం ఈ ఏడాది తగ్గే అవకాశం ఉందని ఉద్యాన శాఖ చెబుతోంది. దీంతో కచ్చితంగా మిర్చికి డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు. ఇదే సమయంలో ఇతర రాష్ట్రాల్లోని పచ్చి మిర్చి ధర కేజీ రూ.20 నుంచి రూ.90కి చేరింది. ఆయా ప్రాంతాల నుంచి ఎండు మిర్చి వచ్చే పరిస్థితి లేదు.

రోజుకు 50 వేల టిక్కీల విక్రయం

గుంటూరు మిర్చి యార్డులో ఏటా డిసెంబరు నుంచి మే నెల మొదటి వారం వరకు సీజన్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలోనే వేర్వేరు జిల్లాలు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా రైతులు మిర్చిని అమ్మకానికి తీసుకొస్తారు. వేసవి ముగిసిన తర్వాత జూన్ రెండో వారం నుంచి అన్ సీజన్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలో శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన మిర్చిని తీసుకొచ్చి రైతులు విక్రయిస్తుంటారు. అన్ సీజన్‌లో రోజుకు 20 వేల నుంచి 30 వేల టిక్కీల మధ్యనే గత కొన్నేళ్లుగా యార్డులో విక్రయాలు జరుగుతున్నాయి. అలాంటిది ఈ సంవత్సరం రోజుకు 50 వేలు సగటున టిక్కీలను కోల్డ్ స్టోరేజ్‌ల నుంచి రైతులు బయటకు తీసుకొస్తున్నారు. సీజన్ ప్రారంభంలో గుంటూరు జిల్లాలోని కోల్డ్‌స్టోరేజ్‌లలో 65 లక్షల టిక్కీలు ఉండగా ఇప్పుడు.. ఆ సంఖ్య 45 లక్షలకు తగ్గింది.

ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు..

మిర్చి సీజన్‌లో ఈ ఏడాది టాప్ క్వాలిటీ వెరైటీలు కూడా క్వింటాల్ రూ. 13 వేలు దాట లేదు. నాణ్యత తక్కువగా ఉన్న రకాలకు క్వింటాల్ ధర రూ.8 వేలు మాత్రమే లభించింది. ఇప్పుడు తేజ వెరైటీ క్వింటాల్ రూ. 14 వేలకు చేరుకొంది. రైతులకు వ్యాపారుల నుంచి అప్పు పుట్టకపోతుండడంతో.. ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆలోచన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ ఇలానే రైజింగ్‌లో ఉంటే కచ్చితంగా ఈ నెలలోనే ధరల్లో పెరుగుదల కనిపించొచ్చని భావిస్తున్నారు.

క్యాంపస్ ప్రొటెక్షన్ యాక్ట్ జీవోపై హర్షం

గుంటూరు (విద్య), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): క్యాంపస్ ప్రొటెక్షన్ యాక్ట్ జీవోను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు విడుదల చేయడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మ) రాష్ట్ర అధ్యక్షుడు కొలసాని తులసి విష్ణుప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నగరంపాలెం ప్రజ్ఞ స్మార్ట్ స్కూల్‌లో జీవో కాపీలను ఆవిష్కరించి, విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాలు అకారణంగా బయట వ్యక్తులు, కొంతమంది తల్లిదండ్రుల నుంచి అనేక ఒత్తిళ్లు, దౌర్జన్యాలు ఎదుర్కోవడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన జీవో ప్రకారం ప్రైవేట్ స్కూల్స్ క్యాంపస్‌లలో రాజకీయ పార్టీలకు సంబంధించిన గుర్తులు, వస్తువులు,



కరపత్రాలు విడుదల చేస్తున్న అపుస్మ నాయకులు విష్ణుప్రసాద్ తదితరులు

జెండాలు, ప్రదర్శనలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. అలాగే సమూహాలు, వివిధ సంఘాల పేరుతో విధ్వంసాలు, భౌతిక దాడులకు దిగడం నేరమని తెలిపారు. అపుస్మ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.మస్తాన్ రావు, అడిషనల్ ట్రెజరర్ కాటూరి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నాయుడు చక్రనాగ్, నగర అధ్యక్షుడు కన్నా మాస్టర్, జిల్లా కోశాధికారి ఎస్.సాంబిరెడ్డి పాల్గొన్నారు.

జూడో జిల్లా స్థాయి ఎంపికలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

గుంటూరు (క్రీడలు) ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) జూడో సంఘ ఆధ్వర్యంలో మంగళగిరిలోని డాన్ బాస్కో స్కూల్లో ఆదివారం జూడో జిల్లా ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9, 10 తేదీల్లో పెద్ద పరిమిలో జరగనున్న రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొననున్నట్లు సంఘ కార్యదర్శి బి.కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. సంఘ అధ్యక్షుడు ఎ.శ్రీహరి నాయుడు, పీఈటీ రాజు, శిక్షకులు నాగదుర్గ, సాంబశివరావు పాల్గొన్నారు. బాలుర విభాగంలో ఎం.గురుతేజ, బి.రేవంత్‌బాబు, జి.ప్రసాద్ ఎస్.యశ్వంత్, సీహెచ్ లక్ష్మీ నరసింహమూర్తి, పి.నాగాచరణ్, కె.గౌతమ్, కె.దుర్గాప్రసాద్, టి.జాకబ్, బాలికల విభాగంలో ఎస్ దివ్యశ్రీ, ఎం.ప్రశాంత, ధన్య, శివ నాగజ్యోతి, డి.పవిత్ర, పి.పావని షేక్ అప్సన, టి.విజయలక్ష్మి, వై.అమూల్య, జి.మధురిమ ఎంపికయ్యారని తెలిపారు.

జర్నలిజం అంతిమ ప్రయోజనం.. సమాజ సంక్షేమం


- ప్రెస్ అకాడమీ చైర్మన్ సురేష్‌కుమార్

తెనాలి అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జర్నలిజం అంతిమ ప్రయోజనం సమాజ సంక్షేమం కావాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో రెండు రోజుల గ్రామీణ విలేకర్ల శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. సభకు ఆయన అధ్యక్షత వహించి, మాట్లాడారు. గ్రామీణ విలేకర్ల పునశ్చరణ తరగతులు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. ఏపీ డబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు తగ్గిపోయాయన్నారు. ఆరోగ్య బీమా పొందాలంటే గుర్తింపు కార్డు అవసరమని.. ప్రభుత్వం ఇందుకు జీవో జారీ చేసినా ఆమోదం పొందలేదని చెప్పారు. దీనిపై మంగళవారం నిర్వహించనున్న కార్యక్రమంలో సభ్యులంతా పాల్గొనాలని కోరారు. బిహార్ మాదిరిగా జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. శిక్షణ పొందిన విలేకర్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సీనియర్ పాత్రికేయుడు బొల్లిముంత కృష్ణను సత్కరించారు. సీఆర్ మీడియా అకాడమీ, ఏపీ డబ్ల్యూజే తెనాలి శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో తెనాలి శాఖ అధ్యక్షుడు చందు సుబ్బారావు, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, కార్యదర్శి మణిరామ్, చందు జనార్దన్, విద్యాధర మురళీ, ఏచూరి శివ, మీరా, వీరవల్లి మురళి, గోపిచంద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఏడు అంశాలలో నిర్వహించిన పునశ్చరణ తరగతుల్లో ఆంధ్రజ్యోతి పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి దేవగళ్ల రామకృష్ణ.. విలేకర్ల నుంచి డెస్క్ ఏం కోరుకుంటుంది.. అనే అంశాన్ని వివరించారు. గ్రామీణ వార్తలు - కథనాలు అనే అంశంపై సీనియర్ పాత్రికేయులు సోమసుందర్, పత్రికా భాష - మెళకువలు అనే అంశంపై ఆంధ్రజ్యోతి తూర్పు గోదావరి జిల్లా డిప్యూటీ న్యూస్ ఎడిటర్ మంగేష్ ప్రసంగించారు. స్మార్ట్ రిపోర్టింగ్ అనే అంశాన్ని విశాలాంధ్ర వర్కింగ్ ఎడిటర్ అజయ్ అవగాహన కల్పించారు.



శిక్షణ పొందిన గ్రామీణ విలేకర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సురేష్‌కుమార్

ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న వరద ఉధృతి



తాడేపల్లి టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజ్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో కేసీ డివిజన్ అధికారులు వరద ప్రవా హాన్ని లెక్కించారు. 1,12,604 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా కేఈ మెయిన్ కెనాల్‌కు 10,271, కేడబ్ల్యూ మెయిన్ కెనాల్‌కు 7,508, గుంటూరు చానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిగతా 94,625 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదులుతున్నారు. బ్యారేజ్‌లో ప్రస్తుతం నీటిమట్టం 12 అడుగుల వద్ద కొనసాగుతోంది. 65 గేట్లను రెండు అడుగులు, ఐదు గేట్లకు ఒక అడుగు పైకి ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



తహసిల్ నాయక్ (ఫైల్ ఫొటో)

బొల్లాపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో ఆదివారం భూక్యా తహసిల్ నాయక్(50) అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. భార్య మంగాబాయితో కలసి గ్రామ సమీపంలో పత్తి ఇరవటానికి నాయక్ వెళ్లాడు. అక్కడ పొలానికి వేసిన సోలార్ ఫెన్సింగ్ మీద కరెంట్ తీగ పడి ఉంది. దీనిని గమనించని నాయక్ ఫెన్సింగ్ దాటుతుండగా.. షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య మంగాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు బొల్లాపల్లి ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

కృష్ణానదిలో యువకుడి గల్లంతు



తహసిల్ నాయక్ (ఫైల్ ఫొటో)

కొల్లిపర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో స్నానానికి దిగి యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రం కొల్లిపర శివారు కొత్తబొమ్మువానిపాలెంలో జరిగింది. ఎస్ఐ కోటేశ్వరరావు వివరాలు మేరకు.. మండల పరిధిలోని తూములూరు గ్రామానికి చెందిన వేము రవికిరణ్ (19) స్నేహితులతో కృష్ణా నదికి వచ్చాడు. నదిలో రవికిరణ్ ఈత కొడుతుండగా.. నీటి ఉరవడికి కొట్టుపోయాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు తెలపగా.. ఎస్ఐ కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈత గాళ్లతో వెతికించారు. ఎట్టకేలకు రవికిరణ్ మృత దేహం లభ్యం పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

చర్చి కమిటీ నిధుల విషయంలో ఘర్షణ

- జమా ఖర్చులు కోరిన టీడీపీ సభ్యులపై దాడి



వైసీపీ మూకల దాడిలో గాయపడిన టీడీపీ నాయకులు

పెదనందిపాడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రులో ఆదివారం సాయంత్రం టీడీపీ, వైసీపీ వర్గీయులు చర్చి కమిటీ విషయంలో ఘర్షణపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఎస్సీ కాలనీలోని ఏఈఎలీసీ చర్చి కమిటీ ప్రెసిడెంట్‌గా వైసీపీకి చెందిన అన్నలదాసు చిన్న ఏసురత్నం గతంలో పనిచేశారు. అతను పనిచేసిన కాలంలో చర్చికి సంబంధిం చిన జమా ఖర్చుల వివరాలు తెలియజేయాలని నూతనంగా ఎన్నికైన టీడీపీకి చెందిన కొందరు సభ్యులు.. ప్రస్తుత అధ్యక్షుడు కొప్పుల యోహానును అడిగారు. దీంతో ఆదివారం సాయంత్రం తెలియజేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వారికి లెక్కలు చెప్పేదేంది అంటూ మాజీ ప్రెసిడెంట్ అన్న కొడుకు అన్నలదాసు జయంతిరావు, ప్రస్తుత ప్రెసిడెంట్ కొప్పుల యోహాను కర్రలతో టీడీపీ సానుభూతిపరులు రవి, సుశీలరావును తీవ్రంగా కొట్టి గాయపర్చారు. ఘటనా స్థలానికి ఎస్ఐ మధుపవన్ చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి, ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రెంటచింతల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలకు సమీపంలోని గొట్టిముక్కల మేజర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ సీహెచ్ నాగార్జున వివరాల మేరకు.. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని నాయుడుపేటకు చెందిన బిళ్లా తేజ(22), కొరపాటి ఆరోగ్యరాజు గురజాల నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. మాచర్ల నుంచి నెల్లూరుకు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ ఢీకొనడంతో.. తేజ అక్కడికక్కడే మృతి చెందాడు. కొరపాటి ఆరోగ్యరాజుకు కుడి కాలు, తల, పొట్ట మీద గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. క్షతగాత్రుడ్ని గురజాల ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

జార్ఖండ్ వాసికి తెనాలిలో దహన సంస్కారాలు

- రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య
- అధికారులకు లేఖ రాసిన మాజీ సీఎం అర్జున్ ముండా

తెనాలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కూలీ తెనాలి రైల్వేస్టేషన్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ రాష్ట్ర మాజీ సీఎం అర్జున్ ముండా ఈ విషయంపై జిల్లా జాయింట్ కలెక్టర్‌కు లేఖ రాశారు. అయితే.. మృతదేహాన్ని అక్కడకు పంపే వీలుకాకపోవడంతో రెవెన్యూ, రైల్వే పోలీసులు.. స్థానికులు, కుటుంబ సభ్యులతో కలిసి తెనాలిలోనే దహన సంస్కారాలు పూర్తి చేశారు. మూడు రోజుల క్రితం గురుదేవ్ సర్దార్ (33) అనే వ్యక్తి తెనాలి రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి వద్ద ఆధారాలతో రైల్వే పోలీసులు బంధువులకు సమాచారం ఇచ్చారు. అతని మృతదేహాన్ని జార్ఖండ్‌కు పంపే ఏర్పాటు చేయాలని మాజీ సీఎం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు లేఖ రాశారు. మృతుడు ట్రైబల్ కుటుంబానికి చెందిన వారు కావడం, పేదరికం కారణంగా మృతదేహాన్ని పంపే బాధ్యతను తీసుకోవాలని కోరారు. మూడు రోజులు కావడంతో మృతదేహాన్ని తరలించేందుకు వీలు కాకపోవడంతో తెనాలి వచ్చిన బంధువుల సమక్షంలో ఆదివారం తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, రైల్వే ఎస్ఐ వెంకటాద్రి శవ పంచనామా నిర్వహించారు. శ్రీ శివలింగేశ్వర స్వామి భక్తబృంద సేవా సమితి సభ్యులు సహకారంతో తెనాలి దహన వాటికలో అంతిమ సంస్కారాలు చేయించి.. వారికి మరణ నివేదికను అందజేశారు.



మృతుని బంధువులను విచారిస్తున్న తహసీల్దార్, రైల్వే ఎస్ఐ

8 నుంచి దివ్యాంగుల క్రికెట్ పోటీలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పిచ్చుకలగుంట మైదానంలో ఈ నెల 8, 9, 10వ తేదీల్లో దివ్యాంగులకు సెంట్రల్ జోన్ ఇన్‌క్లూజివ్ క్రికెట్ కప్ నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ తెలిపారు. పోటీలకు సంబంధించిన పోస్టర్లను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా దివ్యాంగ క్రికెట్ సంఘ కన్వీనర్ నీరుకొండ లీలాకృష్ణారావు మాట్లాడుతూ పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, గుంటూరు జిల్లాల జట్లు పాల్గొంటాయని చెప్పారు. సంఘ సహాయకార్యదర్శి షేక్ నాగులమీరా, సురేష్ పాల్గొన్నారు.

అద్వితీయంగా 'సుపరిపాలనలో తొలి అడుగు'

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి తెలుగుదేశం ప్రచార కార్యక్రమంలో పల్నాడు జిల్లా రాష్ట్రంలో రెండో స్థానం సాధించి, రికార్డు సృష్టించిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణుల సమష్టి కృషికి ఇది నిజమైన గుర్తింపు అన్నారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న నాయకులు, శ్రేణులకే ఈ గౌరవం దక్కుతుందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. నియోజకవర్గాల వారిగా చూస్తే వినుకొండ రాష్ట్రస్థాయిలో 7వ స్థానం, జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. పల్నాడు జిల్లా నుంచి పెదకూరపాడు, చిలకలూరిపేట నియోజక వర్గాలు రాష్ట్రస్థాయిలో 9, 10 స్థానాలు దక్కించుకున్నాయన్నారు. సుపరిపా లనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పల్నాడు జిల్లాలో వినుకొండ, పెదకూరపాడు, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో నూరు శాతం పూర్తిచేయగా.. మాచర్లలో 98.5 శాతం, గురుజాలలో 94.3 శాతం, సత్తెనపల్లిలో 86.9 శాతం, నరసరావుపేటలో 71.9 శాతం పూర్తయిందని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో నమ్మకంతో అప్పగించిన జిల్లా పార్టీ బాధ్యతలను సమన్వయంతో నెరవేర్చే ప్రయత్నంలో ఇది కీలక మైలురాయిగా భావిస్తున్నట్లు కొమ్మాలపాటి పేర్కొన్నారు. కష్టపడి పనిచేచేసిన వారికి అభినందనలు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

వినుకొండటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవ శాత్తూ రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన పట్టణంలోని ఏనుగుపాలెం గేటు సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. ఒప్పిచర్ల గ్రామానికి చెందిన మల్లవరపు సతీష్‌కు వినుకొండలోని శృంగారపువనంకు చెందిన కెజియాతో పదేళ్ల క్రితం వివాహమైంది. ఇతను ఇతర ప్రాంతాలకు వెళ్లి తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి ఏనుగుపాలెం గేటు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ అంజి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిడుగురాళ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనదారుడు శిఖా గోపీ (50)ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన స్థానిక కళ్లం అపార్ట్‌మెంట్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. కారంపూడికి చెందిన గోపీ పిడుగురాళ్లలో నివాసముంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నారు.

వృద్ధురాలిపై దాడి.. బంగారం అపహరణ

సత్తెనపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై దాడి చేసి, బంగారు ఆభరణాలు దొంగలు అపహరించుకెళ్లిన ఘటన పట్టణంలోని పార్కు ఏరియాలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పార్కు ఏరియాలో కేశినేని లక్ష్మీదేవమ్మ నివాసం ఉంటోంది. ఇద్దరు దొంగలు ఆమె గృహంలోని ఓ గదిలోకి వెళ్లి బీరువాను పగల గొట్టారు. లోపల మరో తాళం ఉండటంతో.. బయటకు వెళ్లి లక్ష్మీదేవమ్మను పిలిచారు. ఆమె రావడంతోనే.. మెడలోని ఐదు సవర్లున్న రెండు బంగారు చైన్‌లను లాక్కున్నారు. ప్రతి ఘటించిన ఆమెపై దాడి చేసి గాయపరిచారు. లక్ష్మీదేవమ్మ సొమ్మసిల్లి కింద పడిపోయింది. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు, క్లూస్ టీమ్ గృహానికి వచ్చి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు.

టీ స్టాల్‌లో ఉరేసుకున్న యువకుడు

చిలకలూరిపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లోని ఉన్న టీస్టాల్ ఆవరణలో ఆదివారం ఓ యువకుడు ఉరివేసుకుని చనిపోయాడు. మృతుడు ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం చమట గ్రామానికి చెందిన సాగిలి ఓబుల్ రెడ్డి(35)గా పోలీసులు గుర్తించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. అర్బన్ ఎస్ఐ చెన్నకేశవులు ఘటనా ప్రదేశాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

గుంటూరు (క్రీడలు) ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్‌జీఓ క్లబ్ ఆవరణలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘ ఆధ్వర్యంలో సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 138 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని సంఘ కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. ప్రకాశం జిల్లా చేవూరులో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు అంతర్జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని తెలిపారు. సంఘ అధ్యక్షుడు శివశంకర్ కొల్లి లక్ష్మీనారాయణ, ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కాటా.. కనికట్టు

(5వ పేజీ తరువాయి)

పోర్టబిలిటీ కార్డులు 71165 ఉండటం గమనార్హం. పల్నాడు జిల్లాలో 1289 షాపుల పరిధిలో 2,83,265(44.61 శాతం) మందికి సరుకులు పంపిణీ చేశారు. ఈ జిల్లాలో పోర్టబిలిటీ ద్వారా సరుకులు తీసుకెళ్లిన కుటుంబాలు 1,02,410 ఉన్నాయి. బాపట్ల జిల్లాలో 1123 దుకాణాల పరిధిలో 1,78,359(37.46 శాతం) సరుకుల పంపిణీ జరగ్గా పోర్టబిలిటీ ద్వారా 49,836 మంది తీసుకున్నారు. ఈ నేపథ్యంలో డీలర్ల వద్ద ఉన్న ఎండీయూల ఎలక్ట్రానిక్ కాటాలు(హుక్ టైప్‌వి) స్వాధీనపరుచుకోవాలని వినియోగదారుల సంఘాల నాయకులు సూచిస్తున్నారు. అలానే డీలర్ పేరుతో లింక్ చేసిన ఎలక్ట్రానిక్ కాటా ద్వారానే సరుకుల పంపిణీ జరిగేలా చూడాలని, అలానే జియో కో-ఆర్డినేట్స్‌ని ఈ విషయంలో పరిగణనలోకి తీసుకునేలా నిబంధనలు మార్పు చేయాలని కోరుతున్నారు.

కబళించిన క్వారీ

(5వ పేజీ తరువాయి)

విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపట్టాలని, మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టర్ వెంకటమురళి, చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు నరసరావుపేటలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్న కూలీలను పరామర్శించారు. మృతులకు రూ.14 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.10 లక్షలు చొప్పున పరిహారాన్ని యాజమాన్యం నుంచి ఇప్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఘటనాస్థలాన్ని ఎస్పీ తుషార్‌డూడీ, మైనింగ్ డీడీ రాజశేఖరరావు, ఏడీ రామచంద్రరావు తదితరులు పరిశీలించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుండి వివరాలు సేకరిస్తామన్నారు. ఎస్పీ వెంట బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, సంతమాగులూరు సీఐ వెంకటరావు, బల్లికురవ ఎస్ఐ నాగరాజు, తహసీల్దార్ రవినాయక్, ఇన్‌చార్జి ఎంపీడీవో పాండురంగస్వామి క్వారీ వద్ద సహాయక చర్యలు పర్యవేక్షించారు. ఉదయం 10 గంటల సమయంలో ప్రమాదం జరగగా, మధ్యాహ్నం ఒంటిగంట వరకు మీడియాను ప్రమాద స్థలి వద్దకు పోలీసులు అనుమతించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎత్తిపోతలలో బాలుడి గల్లంతు

విజయపురిసౌత్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తిపోతల జలాశయంలో యువకుడు గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. తెలంగాణలోని మిర్యాలగూడకు చెందిన సమీర్ (16) తన స్నేహితునితో కలిసి ఎత్తిపోతలకు వచ్చాడు. ఈత కొట్టేందుకు ఎత్తిపోతల జలాశయంలో దిగి నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అశోక్ ఘటనా స్థలానికి చేరుకొని.. గజ ఈతగాళ్లతో గాలించారు. చీకటి పడడంతో సమీర్ జాడ గుర్తించడం గజ ఈతగాళ్లకు కష్టంగా మారింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలి

● ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్

అవ వృత లూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. గ్రామాల్లోని సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు వెంటనే స్పందించాలన్నారు. పలు శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా అందించే సేవలను వివరించారు. వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి మాట్లాడుతూ రైతులకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం ద్వారా సంవత్సరానికి రూ.20 వేలు రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. కౌలు రైతులకు కూడా ఈ పథకం వర్తింప చేస్తారన్నారు. వారికి కూడా మొదటి, రెండో విడతలు కలిపి ఒకేసారి వారి ఖాతాల్లో నగదు జమ చేస్తారని తెలిపారు. తొలుత వేమూరు ఏఎంసీ చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారిని పూల మాలలు, శాలువాతో ఎంపీపీ, ఎంపీడీవో మారుతీ శేషమాంబ, ఇతర అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సెంటిని హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

రేపల్లె, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రేపల్లె వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. స్థానిక సంజీవని ఎమర్జెన్సీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు విజయవాడ సెంటిని హాస్పిటల్ సహకారంతో ఉచిత గుండె జబ్బులు, రక్తపోటు వ్యాధుల శిబిరం నిర్వహించారు. గుండె వైద్య నిపుణులు సాయినాద్ బృందం 80మంది రోగులకు వైద్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా రేపల్లె రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కార్పొరేట్ హాస్పిటల్స్ తమ వంతు సేవలు అందిస్తున్నాయన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సక్సేన, కరిముల్లా, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నోట్లకట్టల వీడియో లిక్కర్ స్కాంకు తిరుగులేని నిదర్శనం

● సంగం డెయిరీ మాజీచైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి

బాపట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మద్యం స్కాంలో అరెస్టు అయి జగన్‌కు అత్యంత ఆప్తుడైన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి నమ్మినబంటుగా ఈస్కామ్‌లో డబ్బు చేరవేయటంలో ప్రముఖ పాత్ర వహించిన వెంకటేష్‌నాయుడు కోట్ల విలువైన నోట్ల కట్టను లెక్క వేస్తున్న వీడియో గుట్టును సిట్ రట్టు చేయటం స్కామ్‌కు తిరుగులేని సాక్ష్యంగా నిలుస్తుందని సంగం డెయిరీ మాజీచైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి పేర్కొన్నారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ మాజీమంత్రి అంబటి రాంబాబు, సజ్జల రామకృష్ణారెడ్డిలాంటి వైసీపీ నాయకులు ఆ నోట్లలో 2వేల రూపాయల నోట్లు కూడా ఉన్నందున వాటిని ఎన్నికలకు సంవత్సరం ముందే రిజర్వు బ్యాంకు రద్దు చేసినందున ఆ డబ్బును వైసీపీ ఎన్నికల్లో పంచేందుకు వినియోగించిందని సిట్ చెప్పటాన్ని తప్పుపట్టి తప్పించుకోవాలని చూడటం సిగ్గుచేటు అని కొల్లా అన్నారు. ఈవీడియోలో వెంకటేష్ నాయుడు లెక్కిస్తున్న 2వేల నోట్లు రద్దు కాకముందు, ఎన్నికలకు సంవత్సన్నర ముందు జరిగిన ఏర్పాట్లకు సాక్ష్యంగా నిలుస్తుందన్నారు.

కుల, మత భేదం చూడనది స్నేహం ఒక్కటే

● రోటరీక్లబ్ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు

బాపట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కుల, మత భేదం చూడనది స్నేహం ఒక్కటేనని బాపట్ల రోటరీక్లబ్ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, ధనిక భేదం చూపనిది స్నేహ మాత్రమేనన్నారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన బాపట్ల న్యూస్‌పేపర్ క్లబ్ సభ్యులైన బోయన వెంకట్రావు, షేక్.రఫీ, షేక్.రబ్బానీ, ఆసోది వెంకటరెడ్డి, గోపిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి కొత్త అంజనేయ వరప్రసాద్, కోశాధికారి కొత్త సుబ్బారావు, సీనియర్ సభ్యులు ఏలూరి హరిబాబు, జేవీ కృష్ణారావు, జిట్టా శ్రీనివాసరావు, కోళ్లపూడి ఉపేంద్రగుప్తా, తదితరులు పాల్గొన్నారు.

నిన్న చెట్లు.. ఈ రోజు మట్టి

● షుగర్ ఫ్యాక్టరీ నుంచి అక్రమంగా మట్టి తరలింపు


షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని మట్టిని అక్రమంగా తరలిస్తున్న చిత్రం

వేమూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తుంటే బాధ్యత గల సిబ్బంది అధికారులు చోద్యం చూస్తున్నారు. నిన్నటి రోజున ఫ్యాక్టరీ ప్రాంగణంలోని చెట్లను కాంట్రాక్టర్ ద్వారా స్వాధీనం చేసుకున్న వ్యక్తి ఆర్ అండ్ బీ చెట్లను కూడా నరికి తరలిస్తున్నాడు. ఇదిలా ఉండగా ఫ్యాక్టరీకి సంబంధించిన స్క్రాప్ రూ.9 కోట్లకు కాంట్రాక్టర్‌కు పై స్వాధీనం చేసుకున్న వ్యక్తి ఫ్యాక్టరీ పరిధిలోని మట్టిని అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నాడు. ఫ్యాక్టరీలోని యంత్రాలు, షెడ్లు ఇతరమైన వస్తువులు మాత్రమే కాంట్రాక్టర్ తరలించాల్సి ఉంది. అలా కాకుండా వాటితో పాటు ప్రాంగణంలో మెరకలుగా ఉన్న ప్రాంతాన్ని అంతటిని తవ్వి, ఆ మట్టిని ట్రాక్టర్ రూ.600 చొప్పున యథేచ్ఛగా అమ్ముకుంటున్నాడు. సంబంధించిన ఉద్యోగులు కొందరు విధుల్లో ఉండి కూడా చోద్యం చూస్తున్నారు. దీన్ని అడ్డుకుని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లిక్విడేటర్ వివరణ

అక్రమంగా మట్టి తరలింపు, ఆర్అండ్‌బీ పరిధిలో చెట్లు నరికివేత విషయం తన దృష్టికి రాలేదని లిక్విడేటర్ చంద్రకుమార్ తెలిపారు. దీనిపై వెంటనే సమాచారం తెలుసుకుని సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని మట్టి తరలింపును వెంటనే ఆపివేస్తామని తెలిపారు.

ఆదమరిస్తే ఆపదే..

● మలుపుల వద్ద కనిపించని హెచ్చరిక బోర్డులు
● తరచూ ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు


పూండ్ల-గోపాపురం మధ్య ప్రమాదకరంగా ఉన్న వంతెన మలుపు

బాపట్లరూరల్ ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూండ్ల గ్రామ శివారులో గోపాపురం వెళ్లడానికి ఉన్న రహదారి మలుపు ప్రమాదకరంగా ఉంది. అప్పికట్ల చానల్‌పై ఉన్న వంతెన పక్కన ఆర్ అండ్ బీ రోడ్డు కోతకు గురై ప్రమాదభరితంగా మారింది. దీనికితోడు మలుపు ఉండటంతో వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. గోపాపురం గ్రామానికి వెళ్లాలంటే ఆప్రాంత ప్రజలు ఈ మలుపు మీదగానే


విరిగిన వంతెన సైడ్‌వాల్స్

వెళ్లాల్సి ఉన్నది. ఆ ప్రమాదకర మలుపు వద్ద కనీసం విద్యుత్ దీపాలు కూడా లేకపోవటంతో రాత్రి వేళలో భయం భయంగా ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి ఉన్నదని పూండ్ల, గోపాపురం గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దీనికితోడు ఈ చానల్ వంతెనకు ఓ వైపు సైడ్ వాల్స్ పూర్తిగా విరిగిపోయాయి. ప్రమాదవశాత్తు ఏదైన వాహనం కోతకు గురైన ప్రాంతంలో పడితే చానల్ కూడా దెబ్బతినే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పనుల కోసం ఈ మార్గంలో ట్రాక్టర్ వాహనాల రాకపోకలు ఎక్కువగా జరుగుతాయని సంబంధితాధికారులు స్పందించి ప్రమాదపు అంచుల్లో ఉన్న ఈ వంతెనలకు మరమ్మతులు చేయించటంతోపాటు కాల్వ వంతెనలకు సైడ్‌వాల్ గోడలను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చింతాయపాలెం సొసైటీ అధ్యక్షుడిగా మద్దిబోయిన

● డైరెక్టర్లుగా కొసన రామయ్య, మార్పు పద్మారావు


చింతాయపాలెం సొసైటీ అధ్యక్షుడు మద్దిబోయిన తిరుపతయ్య, సభ్యులు కొసన రామయ్య, మార్పు పద్మారావుతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

కర్లపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని చింతాయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా మద్దిబోయిన తిరుపతయ్య, డైరెక్టర్లుగా కొసన రామయ్య, మార్పు పద్మారావులు నియామకమయ్యారని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మండలంలోని పేరలి గ్రామంలో చింతాయపాలెం సొసైటీ అధ్యక్ష, సభ్యులుగా నియామకమైన తిరుపతయ్య, రామయ్య, పద్మారావులతో ఎమ్మెల్యే ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ సొసైటీ పరిధిలో 600మంది సభ్యులు ఉండగా 6,375 మంది రైతులకు సొసైటీ ద్వారా సేవలందిస్తున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, సభ్యులు రైతులకు మెరుగైన సేవలందించి సొసైటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. సొసైటీ అధ్యక్షుడిగా తనను నియమించినందుకు నరేంద్రవర్మకు మద్దిబోయిన తిరుపతయ్య, డైరెక్టర్లు రామయ్య, పద్మారావులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు ఏహూరి భూపతిరావు, నాయకులు పమిడి భాస్కరరావు, మాడా శ్రీనివాసరావు, కోమట్ల కృష్ణచలపతిరెడ్డి, బీజేపీ నాయకులు షేక్. బాషా, కరీముల్లా, జనసేనపార్టీనాయకులు గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్ర, ముదునూరి రామరాజు, కట్టా సుజాత, సయ్యద్ రఫీ, పఠాన్ అహ్మద్‌బాషా, కరీముల్లాఖాన్, ప్రకాశరావు, మునిపల్లె చిన్న, మేకల యిర్మియా పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వాలి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి విజయమ్మ


రేపల్లెలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి విజయమ్మ

రేపల్లె, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఎస్ విజయమ్మ పేర్కొన్నారు. ఆదివారం తల్లిపాల వారోత్సవాల్లో బాగంగా రేపల్లెలోని పట్టణ ఆరోగ్య కేంద్రం ఉప్పుడి రోడ్డు వైద్యశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సు కు హాజరైన విజయమ్మ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహి స్తున్నట్లు చెప్పారు. బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. తల్లిపాల వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సముద్రాల రమేష్, షేక్ షాహిన్, షేక్ నతిక్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్తబస్టాండ్ కూడలిలో ఆదివారం పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్యఅతిథిగా పాల్గొని పేద మహిళలు, రిక్షా కార్మికులు, ఆటోడ్రైవర్‌లకు దుప్పట్లు పంపిణీ చేశారు. పేద కుటుంబాలవారికి ఈవిధంగా సాయం చేయటం సంతోషమన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కాగిత సుదీర్‌బాబు, దమ్ము దయానందం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే కోన జన్మదిన వేడుకలు

మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కోన రఘుపతి, రమాదేవి దంపతులను ఘనంగా సత్కరించారు. పార్టీలకు అతీతంగా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ రోడ్డుకు ఎంపీపీ శంకుస్థాపన


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ లలితకుమారి

భట్టిప్రోలు(కొల్లూరు), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ డి.లలితకుమారి శంకుస్థాపన చేశారు. ఆదివారం మండల పరిధిలోని కోనేటిపురం పంచాయతీ పరిధిలో రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు ఎంపీపీ తెలిపారు. ఎంపీటీసీల అభ్యర్థనల మేరకు ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎం ఉషారాణి, మల్లేశ్వరరావు, నాగబాబు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

దశావతార వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెదకాకాని, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీదశావతార వెంకన్న స్వామి దివ్య క్షేత్రంలో ప్రత్యేక పూజలను జరిపిస్తున్నారు. శ్రావణమాసం సందర్భంగా ఆదివారం విజయవాడ వాస్తవ్యులు మన్నెపల్లి శ్రీకాంత్, సూర్యవల్లి దంపతులు, కుటుంబ సభ్యులు శ్రీ దశావతార వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలోని మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ పట్టీ సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు, ఆలయ అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

బల్లికురవ మృతులకు ఎంపీ సంతాపం


ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండలంలో గ్రానైట్ క్వారీ నందు జరిగిన దుర్ఘటనపై ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ విచారం వ్యక్తం చేశారు. జీవనోపాధి కోసం ఒడిస్సా నుంచి ఇక్కడకు వచ్చి పనిచేస్తున్న కార్మికుల్లో ఆరుగురు మృతి చెందటం, 8 మందికి గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందటం బాధాకరమన్నారు. మృతులకు సంతాపం ప్రకటించి క్షతగాత్రులు క్షేమంగా బయటపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. నష్టపరిహారం ఏ విధంగా అందించాలనే విషయం యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. దీనికి కారకులైన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేశారన్నారు. యాజమాన్యం తప్పు వల్ల జరిగిందనే విషయంపై విచారణ జరపాలన్నారు. పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటుందన్నారు. మైనింగ్, పోలీసు అధికారులు దర్యాప్తు చేసి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కార్మికుల మృతి బాధాకరం

● బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ



బాపట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండలంలోని గ్రానైట్ క్వారీలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు కార్మికులు దుర్మరణం చెందటం, పలువురికి గాయాలు కావటం బాధాకరమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ మృతులకు సంతాపం ప్రకటించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. గాయపడిన కార్మికులను ప్రభుత్వ అత్యుత్తమ వైద్యం అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పేద కార్మికుల చికిత్సలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ఈ ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అక్రమ మైనింగ్, సురక్షిత ప్రయాణాలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న క్వారీలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

కూలిన జెండా చెట్టు.. తప్పిన ప్రమాదం


మహాత్మాగాంధీరోడ్డులో ఇంటి మీద పడిన జెండా చెట్టు

బాపట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మహాత్మా గాంధీ రోడ్డులో అయ్యప్పస్వామి దేవాలయం పక్కనే ఉన్న జెండాచెట్టు విరిగి ఇంటికప్పు మీద పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవటం వల్ల ప్రమాదం జరగలేదు. దీనిపై అధికారులు స్పందించాలని బాధిత కుటుంబం కోరుతుంది.


తుమ్మలపల్లి బ్రాంచ్ కాల్వకు గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

టీబీ కాల్వకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

కర్లపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం మండలంలోని పేరలి పంచాయతీ పరిధిలోని పేరలమ్మ గుడి దగ్గర తుమ్మలపల్లి కాల్వకు గండిపడిందని.. అధికార యంత్రాంగం వెంటనే అప్రమత్తమై కాల్వకట్ట మరమ్మతులు చేపట్టాలని నరేంద్రవర్మ ఆదేశించారు. గండిపడిన తుమ్మలపల్లిశాఖ కాల్వను రైతులతో కలిసి నరేంద్రవర్మ ఆదివారం సందర్శించారు. నీటిసంఘ నాయకులను, అధికారులను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే పనులు పూర్తి చేయాలని వేగేశన ఆదేశించారు.

శ్రీబగళాముఖిని దర్శించుకున్న జేసీ దంపతులు


జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్ దంపతులకు స్వాగతం పలుకుతున్న ఆలయ ఈవో జి.నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయానికి వచ్చిన జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్ దంపతులకు ఆలయ మర్యాదలతో కార్యనిర్వాహణాధికారి వారికి స్వాగతం పలికారు. శ్రీబగళాముఖి అమ్మవారికి వారు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ఈవో జి.నరసింహమూర్తి గంగాధర్‌గౌడ్ దంపతులను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దంపతులు దేవదాయశాఖ మాసపత్రికైన ఆరాధన పుస్తకాన్ని భక్తులకు దేవస్థానం తరపున ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు కె.శ్రీనివాసరావు, నాగుల శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత కలహాలతో అభివృద్ధి శూన్యం

● సమస్యలపై దృష్టి సారించని పాలకవర్గం
● పంచాయతీ పనితీరుపై గ్రామస్థుల ఆగ్రహం


మరమ్మతులు చేయకుండా వదిలివేసిన గ్రామ రక్షిత మంచినీటి పైపులైన్

అవ్వృత లూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అమృతలూరు పంచాయతీ పనితీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నా పనితీరు మాత్రం మారడం లేదు. గ్రామ పరిధిలో సమస్యలు తిష్ట వేసి ఉన్నా పరిష్కరించేవారే లేరు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం పైపు లైన్‌లు సుమారు 8 చోట్ల లీకులు ఏర్పడ్డాయి. వీటిని తవ్వి పైపు లైన్‌కు రబ్బరు చుట్టి వదిలివేశారు. నెలలు గడుస్తున్నా వీటికి శాశ్వత మరమ్మతులు కూడా చేయలేదు. ఈ గుంతలను కూడా పూడ్చలేదు. అసలే వర్షాకాలం రోగాలు వ్యాప్తి చెందే సమయం కూడా కావడంతో గ్రామస్థులు పంచాయతీ పని తీరుపై ఆవేదన చెందుతున్నారు. సంతబజారులో అయితే సుమారు 3 చోట్ల వర్షం నీరు రోడ్డుపై రోజుల తరబడి నిలిచి ఉంటున్నాయి. వీటి సమస్యను ఇంతవరకు పరిష్కరించలేదు. ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ పాలకవర్గం పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. సర్పంచ్, పాలకవర్గ సభ్యుల మధ్య ఉన్న విబేధాలతో ఇప్పటికే పలువురు కార్యదర్శులు బదిలీలపై వెళ్లిపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలోని పనులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటో ఢీకొని అపస్మారక స్థితిలోకి కంప్యూటర్ ఆపరేటర్

కర్లపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఆటో ఢీకొని జాతీయ రహదారిపై పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిన సంఘటన నల్లమోతువారిపాలెం జాతీయ రహదారి సమీపంలో ఆదివారం జరిగింది. కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం కర్లపాలెం పోలీసుస్టేషన్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.అనంత్‌కుమార్ బాపట్ల వైపు వెళుతుండగా నల్లమోతువారిపాలెంలో జాతీయ రహదారిపై బాపట్ల వైపు వెళుతున్న ఆటో ఒక్కసారిగా అడ్డం తిరగటంతో అనంతకుమార్ ఆటోను ఢీకొని రోడ్డుపై పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయాడని తెలిపారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

అగ్నిప్రమాదాలపై ప్రజలకు అప్రమత్తత అవసరం

● ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసురావు


అగ్నిబాధిత కుటుంబాలకు టార్పలిన్ పట్టాలను అందజేస్తున్న మండల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసురావు తదితరులు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్లపాలెం మండల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసురావు అన్నారు. పిట్టువారిపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు ఏట్రా బాలారెడ్డి, కోటేశ్వరమ్మ కుటుంబాలకు ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి తాత్కాలిక గూడారాలు ఏర్పాటు చేసుకునేందుకు టార్పలిన్ పట్టాలను బాధితులకు అందజేశారు. బాపట్లకు చెందిన బొంతా శామ్యూల్ త్యాగరాజ్ వారి సహకారంతో బాధితులకు నిత్యావసర సరుకులు, దుస్తులు, వంట సామగ్రిని పోలీసురావు చేతులమీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కేఎస్ సోమరాజు, డి.దుర్గారావు, ఐ.కరుణసాగర్ బాధితులు తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై గోతులు పూడ్చరా..?


వంతెనపై ఏర్పడ్డ గోతులు

వేమూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): 24 గంటలు వాహనాలతో రద్దీగా ఉండే తెనాలి-కొల్లూరు ప్రధాన రహదారిపై వేమూరులోని భట్టిప్రోలు డ్రెయిన్‌పై ఉన్న వంతెనపై గుంతలు పడ్డాయి. ఈ మార్గం నుంచి కృష్ణా జిల్లాతో పాటు రేపల్లె, బాపట్ల తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. వంతెన వద్ద పడ్డ భారీ గుంత వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అవీ..ఇవీ..

కారు ఢీకొని మోటార్‌సైకిలిస్టుకు తీవ్రగాయాలు

అద్దంకి, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): నామ్ రోడ్డులో మలుపు తిరుగుతున్న మోటార్‌సైకిలిస్టును కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు ప్రకాశం జిల్లా దర్శి మండలం చినఉయ్యాలవాడకు చెందిన గాలం కోటేశ్వరరావు ఆదివారం సాయంత్రం మోటార్‌సైకిల్‌పై అద్దంకి మండలం శాంతినగర్ వద్ద నామ్ రోడ్డులో యూ టర్న్ తీసుకుంటుండగా కావలి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన కోటేశ్వరరావును స్థానికులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

వ్యాసరచన పోటీ

అద్దంకిటౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో యం.త్రిమూర్తులు సౌజన్యంతో విద్యార్థులు, పౌరులకు 'జీవనది గుండ్లకమ్మ పరిరక్షణ' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహిస్తున్నట్లు సంస్థల ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో ఎక్కడి నుంచైనా పాల్గొన వచ్చని, వ్యాసరచన రాసిన పేపర్లను ఈ నెల 6వ తేదీ సాయంత్రంలోపు పాత ఎల్ఐసి ఆఫీస్ ఎదురు దుకాణంలో అందజేయాలన్నారు. వ్యాసరచన రెండు, మూడు పేజీలకు మించకూడదని,, విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, అలాగే పౌరులకు మూడు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 7న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9848749979, 9182688106 నంబర్లను సంప్రదించాలన్నారు.

తరంగగానానికి జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు శ్రీకృష్ణ సంపత్‌కుమార్



సంపత్‌కుమార్‌కు కళాపురస్కారాన్ని అందజేస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తరంగగానంలో అపూర్వమైన ప్రతిభను ప్రదర్శిస్తున్న కవి శ్రీకృష్ణ సంపత్‌కుమార్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక పుట్టంరాజు కళాక్షేత్రంలో కవి శ్రీకృష్ణ సంపత్‌కుమార్‌కు పుట్టంరాజు బుల్లెయ్య- రామలక్ష్మమ్మల విస్తృత కళాపురస్కారం అందజేశారు. పద్య కవి డీవీఎం సత్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులు కవి సంపత్‌కుమార్‌కు విస్తృత కళాపురస్కారాన్ని అందజేయగా సభ్యులందరు ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో కార్యదర్శి కేవీ.పోలిరెడ్డి, కోశాధికారి చుండూరి మురళీ సుధాకరరావు, వారణాసి రఘురామశర్మ, వెంకట శివరామప్రసాదు, ఎన్‌వీఎల్ హనుమంతరావు, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, యువీ.రత్నం, దేవపాలన, దివాకర్‌దత్తు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల మందు తిన్న యువతి మృతి

● ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం

అద్దంకి, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి సహజీవనం చేస్తున్న యువకుడు పెళ్లికి నిరాకరించాడని యువతి ఎలుకల మందు తిని చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అద్దంకి పట్టణంలో చోటుచేసుకొంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలేనికి చెందిన కీర్తిపాటి రమ్య(22) అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులోని ఓ ఫిజియోథెరపీ సెంటర్‌లో పనిచేస్తోంది. పక్కనే ఓ ల్యాబ్‌లో పనిచేస్తున్న పి. ప్రవీణ్‌కుమార్‌లు ప్రేమించుకున్నారు. వీరు రామాటాకీస్ బజార్‌లో గది అద్దెకు తీసుకొని కలిసి ఉంటున్నారు. అయితే కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపారని, పెళ్లి చేసుకునేందుకు ప్రవీణ్‌కుమార్ నిరాకరించాడు. దీంతో గత నెల 27న ఎలుకల మందు తిని, నిద్ర మాత్రలు మింగింది. విషయం తెలుసుకున్న రమ్య సోదరి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. అయితే చికిత్స పొందుతూ శనివారం రమ్య మృతి చెందింది. అక్కడ నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరసింహ తెలిపారు.

6న సత్రం బడిలో ప్రత్యేక వైద్య శిబిరం

అద్దంకిటౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని సత్రంబడి ఆవరణంలోని ఈ నెల 6న బాపట్ల జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో అద్దంకి నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్యశిబిరం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంఈవో అనంతు శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ క్యాంపునకు ఉత్తరప్రదేశ్ కాన్పూరుకు చెందిన అలెంకో సంస్థకు చెందిన వైద్యుల బృందం హజరై వైద్య పరీక్షలు చేస్తుందన్నారు. నియోజవర్గంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్, ప్రైవేయిట్ పాఠశాలలలోని 18 సంవత్సరాలలోపు ఉన్న వివిధ రకాల వైకల్యాలు కలిగిన విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి, అవసరమైన ఉపకరణాలను అందజేస్తారన్నారు. ఈ క్యాంప్‌కు హాజరయ్యే విద్యార్థులు ఆధార్‌కార్డు, సదరన్ సర్టిఫికేట్, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ పోటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని నియోజవర్గంలోని ఐదు మండలాల్లోని ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9849960723, 9100996459లను సంప్రదించాలన్నారు.

ఆదమరిస్తే అంతే..

● బొమ్మల కూడలిలో ప్రమాదకరమైన గుంత



బొమ్మలకూడలిలో ఏర్పడిన గుంతలో నిలిచిన నీరు

పర్చూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : నిత్యంరద్దీగా ఉండే పర్చూరు బొమ్మల కూడలిలో బీటీరోడ్డును కలుపుతూ ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డు మధ్య ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. గుంతను గుర్తించని ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికితోడు సమీపంలోని దుకాణదారులు తమ దుకాణాల ముందు ఇష్టారాజ్యంగా మెరకలు పోయడంతో వర్షపు నీరు గుంతలో చేరి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదకరంగా మారిన గుంతకు మరమ్మతులు చేయించడంతోపాటు, దుకాణాల ముందు ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన మెరకను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేదరమెట్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మేదరమెట్ల బస్టాండ్ సెంటర్ వద్ద నుంచి గ్రామంలోకి వేళ్లే ప్రధాన వీధిలో డాక్టర్ పున్నయ్య హస్పిటల్ వరకు సోమవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం సరఫర నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

భీమేశ్వరస్వామి ఆలయంలో తవ్వకాలు

గుప్తనిధుల కోసం రాత్రికి రాత్రే తవ్వకాలు



ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్విన ప్రాంతం

అద్దంకి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం భీమలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు మరోసారి తవ్వకాలు జరిపారు. సామాన్యశకం 8వ శతాబ్దానికి పూర్వం నాటి దేవాలయంగా భావిస్తున్న ధర్మవరం సమీపంలోని భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో గుప్త నిధుల కోసం ఇప్పటికే 10 సార్లకుపైగా తవ్వకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. గత ఏడాది ఫిబ్రవరి నెలలో కూడా తవ్వకాలు జరిగాయి. ఆరేడు సంవత్సరాల క్రితం దేవాలయం లోపల శివలింగం ఉన్న ప్రాంతంలో కూడా తవ్వకాలు చేశారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేపట్టారు. దేవాలయం ముందు భాగంలోని నాపరాళ్లను తొలగించి తవ్వకాలు చేసినట్లు భావిస్తున్నారు. బయట పడ్డ బండ రాళ్లను సమీపంలో పడవేశారు. అనంతరం మరలా నాపరాళ్ళు యదావిధిగా పరిచి సిమెంట్ పూత పూసారు. ఆదివారం ఉదయం దేవాలయానికి వెళ్లిన భక్తులు తవ్వకాలు జరిగిన విషయాన్ని గమనించి దేవాదాయ శాఖ అధికారులకు తెలియజేశారు. అద్దంకి గ్రూపు దేవస్థానాల ఈవో శైలేంద్రకుమార్, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అతి పురాతన దేవాలయం కావడంతో గుప్త నిధులు ఉన్నాయన్న ఆలోచనతో తరచూ తవ్వకాలు జరుపుతున్నట్లు తెలు స్తోంది. పంచపాండవులు ధర్మవరం సమీపంలో 5 శివలింగాలను ప్రతిష్టించి దేవాలయాల నిర్మాణం చేపట్టారు. భీముడు ప్రతిష్ఠించిన శివలింగం కావడంతో భీమ లింగేశ్వరస్వామి దేవాలయంగా పిలుస్తున్నారు. భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో శివలింగం నేలపైన మూడు అడుగుల ఎత్తు ఉండగా, భూమి లోపల మరో అడుగులు ఉన్నట్లు భక్తులు చెబుతున్నారు. భీమ లింగేశ్వరస్వామి దేవాలయం పునరుద్ధరణకు ప్రభుత్వం నుంచి త్వరలో సుమారు రూ.1.50 కోట నిధులు మంజూరుకు మంత్రి రవికుమార్ కృషి చేస్తున్నారు.

పేదల వైద్యుడి మృతి అత్యంత బాధాకరం

● ఎమ్మెల్యే కొండయ్య



డాక్టర్ సాల్మన్ పార్థివదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

సాల్మన్‌సెంటర్(చీరాల), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రాంతంలో వేలమంది నిరుపేదలకు నాణ్యమైన వైద్యం నిర్విరామంగా అందించి, ప్రజాదరణ పొందిన వైద్యులు డా.రిచర్డ్సన్ సాల్మన్ అకాల మరణం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ అన్నారు. ఆదివారం డా.సాల్మన్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులుగా, సంఘ సంస్కర్తగా ప్రజల్లో గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచినట్లు పేర్కొన్నారు. తండ్రిబాటలోనే ప్రజాసేవకు జీవితం అర్పించినట్లు చెప్పారు. అలాగే ప్రభుత్వ భవనాలకు సొంత స్థలాలను బహుకరించినట్లు వివరించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. వారి వెంట టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిమ్మనపాలెం వద్ద అండర్‌పాస్ నిర్మించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్నకుమారి

మేదరమెట్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో తిమ్మనపాలెం వద్ద అండర్‌పాస్ నిర్మించాలని మండల సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ తీర్మానం కాపీని జాతీయ రహదారుల విభాగం పీడీకి పంపించాలని నిర్ణయించారు. ఆదివారం కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో .'ఆంధ్రజ్యోతి'లో రెండు రోజుల క్రితం 'పక్కవీధికి వెళ్లలంటే 8 కిలోమీటర్లు తిరిగి వెళ్లాలి' అనే శీర్షికన ప్రచురితమైన కథనం చర్చకు వచ్చింది. సమావేశంలో తిమ్మనపాలెం గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను, అక్కడ 12 మీటర్ల వంతెన నిర్మించాల్సిన అవసరాన్ని గురించి మాట్లాడారు. వర్షాకాలం వస్తున్నందున గ్రామాలల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. కాలువలో ఎక్కడ నీరు నిల్వకుండా చర్యలు తీసుకో వాలన్నారు. దోమలు గుడ్లు పెట్టడానికి వీలు లేకుండా ఆయిల్ బాల్స్ వంటివి వేయాల న్నారు. అన్ని శాఖల అధికారులు ఆయా శాఖల నివేదికలను ప్రజాప్రతినిధులకు వివరించారు. సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టుమార్టం ఆలస్యం చేయడంపై ఆందోళన



అద్దంకి ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

అద్దంకి, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): పోస్టుమార్టం ఆలస్యం కావడంపై ఓ మృతురాలి బంధువులు ఆదివారం రాత్రి అద్దంకి ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆందోళన చేపట్టారు. వివరాలలోకి వెళితే మండలంలోని కొత్తరెడ్డిపాలేనికి చెందిన కర్ల వెంకటరెడ్డి, ఆదినారాయణమ్మలు అద్దంకి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. గత నెల 31న దర్శిలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. ఈ దంపతులు తిరిగి తమ మోటార్‌సైకిల్‌పై వస్తూ ముండ్లమూరు సమీపంలో స్పీడు బ్రేకర్ వద్ద కిందపడ్డారు. దీంతో ఆదినారాయణమ్మకు తీ వ్ర గాయాలు అయ్యాయి. అనంతరం ఆమెకు అద్దంకి, ఒంగోలు, గుంటూరు వైద్యశాలలో చికిత్స అందించినా, శనివారం మృతి చెందింది. అయితే గుంటూరులో పోస్టుమార్టం నిర్వహించకుండానే అద్దంకి తీసుకువచ్చారు. ప్రమా దంపై ముండ్లమూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై, ఉండటం, వైద్యశాల నుంచి సమాచారం రావడంతో ఆదివారం సాయంత్రం పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తీసుకువచ్చారు. అయితే చీకటిపడిందని పోస్టుమార్టం చేసేందుకు వైద్యులు నిరాకరించారు. దీంతో ఆదివారం రాత్రి బంధువులు ఆందోళన చేపట్టారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

పర్చూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని ఎస్సై జి.వి.చౌదరి మందుబాబులను హెచ్చరించారు. పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామ శివారులోని నిరుపయోగంగా ఉన్న ఒకనాటి బాలుర వసతి గృహంలో మద్యం సేవిస్తున్న యువకులను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ నిర్వహించారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, బొమ్మల కూడలిలో పలు ప్రాంతాల్లో ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పోలీసుల రంగప్రవేశంతో మందుబాబులు ఉరుకులు పరుగులు తీశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎక్కడైనా బహిరంగ ప్రదేశాలతోపాటు, బస్టాండ్‌లు తదితర ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్నట్లు గుర్తిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. నిబంధనలను అతిక్రమించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోక తప్పదన్నారు. యువత మాదకద్రవ్యాలకు లోనుకాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులతోపాటు, ప్రజలపై కూడా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

కాటాతో.. కనికట్టు

(5వ పేజీ తరువాయి)

పోర్టబిలిటీ కార్డులు 71165 ఉండటం గమనార్హం. పల్నాడు జిల్లాలో 1289 షాపుల పరిధిలో 2,83,265(44.61 శాతం) మందికి సరుకులు పంపిణీ చేశారు. ఈ జిల్లాలో పోర్టబిలిటీ ద్వారా సరుకులు తీసుకెళ్లిన కుటుంబాలు 1,02,410 ఉన్నాయి. బాపట్ల జిల్లాలో 1123 దుకాణాల పరిధిలో 1,78,359(37.46 శాతం) సరుకుల పంపిణీ జరగ్గా పోర్టబిలిటీ ద్వారా 49,836 మంది తీసుకున్నారు. ఈ నేపథ్యంలో డీలర్ల వద్ద ఉన్న ఎండీయూల ఎలక్ట్రానిక్ కాటాలు(హంక్ ట్రైప్‌వి) స్వాధీనపరుచుకోవాలని వినియోగదారుల సంఘాల నాయకులు సూచిస్తున్నారు. అలానే డీలర్ పేరుతో లింక్ చేసిన ఎలక్ట్రానిక్ కాటా ద్వారానే సరుకుల పంపిణీ జరిగేలా చూడాలని, అలానే జియో కో-ఆర్డినేట్స్‌ని ఈ విషయంలో పరిగణనలోకి తీసుకునేలా నిబంధనలు మార్పు చేయాలని కోరుతున్నారు.

మద్యం తాగి బైకును తగులబెట్టారు..!

ఒంగోలు క్రైం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఫూటుగా మద్యం తాగిన స్నేహితులు తరువాత గొడవపడి మోటార్‌సైకిల్‌ను పెట్రోలు పోసి తగులబెట్టారు. ఈ ఘటన ఆదివారం ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్డులోని పాలకేంద్రం వద్ద చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రాజస్థాన్‌కు చెందిన లూనారాయ్, సాయి స్టోన్ ఆర్టిస్టిలో గోవింద్ అనే మేస్త్రి వద్ద పనిచేస్తున్నాడు. అదేవిధంగా చీమకుర్తి గ్రానైట్స్‌లలో రాజస్థాన్‌కు చెందిన అర్జున్, కిషోర్ పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం అర్జున్, కిషోర్ ఒంగోలు వస్తూ లూనారాయ్‌కి ఫోన్ చేసి మద్యం తాగుదామని చెప్పుకున్నారు. అయితే లునారాయ్ తన మేస్త్రీ గోవింద్ మోటార్ సైకిల్‌పై వ స్తుండగా పాలకేంద్రం వద్ద వరకు వచ్చే సరికి వాహనంలో పెట్రోల్ అయిపోయింది. ఈమేరకు కిషోర్, అర్జున్‌లకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పి వస్తూ పెట్రోలు తీసుకురమ్మని చెప్పాడు. దీంతో వారు ఓ బాటిల్‌లో పెట్రోలు తెచ్చి వాహనంలో పోయలేదు. మోటార్‌సైకిల్ కవర్‌లో పెట్టి ముగ్గురు చీమకుర్తి నుంచి తెచ్చిన మోటార్‌సైకిల్‌పై వెళ్ళి మద్యం తాగారు. అక్కడ గొడవపడ్డారు. దీంతో కవర్‌లో ఉన్న బాటిల్ బయ టకు తీసి వాహనంపై పెట్రోల్ పోసి తగులపెట్టి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

కబళించిన క్వారీ

(5వ పేజీ తరువాయి)



మృతదేహాలను పరిశీలిస్తున్న గంగాధర్‌గౌడ్

విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపట్టాలని, మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టర్ వెంకటమురళి, చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు నరసరావుపేటలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్న కూలీలను పరామర్శించారు. మృతులకు రూ.14 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.10లక్షలు చొప్పున పరిహారాన్ని యాజమాన్యం నుంచి ఇప్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ తుషార్ డూడీ, మైనింగ్ డీడీ రాజశేఖరరావు, ఏడీ రామచంద్రరావు తదితరులు పరిశీలించారు. పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామ న్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుండి వివరాలు సేకరిస్తా మన్నారు. ఎస్పీ వెంట బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, సంతమాగులూరు సీఐ వెంకటరావు, బల్లికురవ ఎస్ఐ నాగరాజు, తహసీల్దార్ రవినాయక్, ఇన్‌చార్జి ఎంపీడీవో పాండు రంగస్వామి క్వారీ వద్ద సహాయక చర్యలు పర్యవేక్షించారు. ఉదయం 10 గంటల సమయంలో ప్రమాదం జరగగా, మధ్యాహ్నం ఒంటిగంట వరకు మీడియాను ప్రమాద స్థలి వద్దకు పోలీసులు అనుమతించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒడిసాకు మృతదేహాల తరలింపు

అద్దంకి, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీలో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందిన నలుగురి మృతదేహాలను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాలను ఒడిసా రాష్ట్రంలోని స్వగ్రామాలకు పంపించారు. జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్, డిఎంహెచ్‌వో విజయమ్మ, బాపట్ల డిఎస్‌పీ రామాంజనేయులు, అద్దంకి పట్టణ, మార్టూరు సీఐలు సుబ్బరాజు, శేషగిరిరావు తదిత రులు పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

చీరాల, ఆగస్టు 3 (ఆంధ్ర జ్యోతి) : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వలన భవిష్యత్తు తరాలు ఆనందంగా జీవిస్తాయని ఎమ్మెల్యే కొండయ్య, నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని నగరవనాన్ని వారు పరిశీలించారు. అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. అక్కడి జాతీయ రహదారి వెంబడి మొక్కలు నాటారు. కీర్తివారిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పోలేరమ్మ వారి కొలుపులలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోమేపల్లి కావ్యకు డాక్టరేట్



అవార్డు ప్రదానోత్సవంలో కావ్య

అద్దంకిటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అద్దంకికి చెందిన ఉపాధ్యాయుడు సోమేపల్లి హనుమంతరావు కుమార్తె సోమేపల్లి కావ్య అమెరికాలోని యూనివర్శిటిలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. కావ్య అమెరికాలోని యుఎంకేసీ యూనివర్శిటిలో ఎం.ఎస్(సివిల్) పూర్తి చేశారు. అనంతరం అ మెరికాలో ఫిలడెల్ఫియాలోని టెంపుల్ యూనివర్శిటిలో 'మల్టీస్కేల్ ఎనాలిసిస్ ఆఫ్ సిక్స్ పీపీడీ -క్వినోనే' అనే అంశంపై పరిశోధన చేసి అతి తక్కువ కాలంలోనే ప్రొఫెసర్ డాక్టర్ అందలూరి గంగాధర్ పర్యవేక్షణలో పిహెచ్‌డి పూర్తి చేశారు. టెంపుల్ యూనివర్శిటి ఛైర్మన్, ప్రొఫెసర్ డాక్టర్ ఫిలిప్ ఉడోయిస్ యాంగ్, ప్రొఫెసర్ డాక్టర్ ఇచున్‌ఝూ, ప్రొఫెసర్ డాక్టర్ మోహన్ ఆచారిలు అబ్జర్వర్‌లుగా వ్యహరించి సోమేపల్లి కావ్యకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

పేద విద్యార్థికి పూర్వవిద్యార్థుల ఆర్థికసాయం

వేటపాలెం(చీరాల), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : దాతలు అందించిన తోడ్పాటుతో విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని పలువురు అన్నారు. మండల పరిధిలోని బండ్ల బాపయ్య కళాశాలలో ఇంటర్‌లో సయ్యద్ సుభాని 983 మార్కులతో ఉత్తమంగా రాణించాడు. దీంతో అతనికి ఆ కళాశాల పూర్వ విద్యార్థులు ఎంఎస్ బేగ్, బండ్ల బాబు, దేవర గంగాధర్‌రావులు కలిసి రూ.13 వేలు ఆర్థిక సాయం అందజేశారు. విద్యాదశలో చదువుకు ఆర్థిక సమస్యలు ఉండకూడదని అన్నారు. కార్యక్రమంలో సయ్యద్ మొహిద్దీన్, సదాశివరావు, భార్గవరామ్, ఖాదర్, అజీజ్, సుభాని, రంగ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యసూత్రాలపై అవగాహన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీనివాసులు

చీరాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : శ్రేష్ఠమైన ఆహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించడం అందరికి ఆనందకరమని ప్రొఫెసర్ డా. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆరోగ్య సూత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరూ విధిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో యల్లమందరెడ్డి, కట్టా రాజ్ వినయ్‌కుమార్, రామారావు, మునీరుల్లా, నాగవీరభద్రాచారి, వెంకటేశ్వర్లు, శివాంజనేయ ప్రసాద్, కృష్ణమూర్తి, శర్మ, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రతివ్యక్తి ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవాలి

● గుండెవైద్య నిపుణుడు డాక్టర్ నాగకిరణ్



రోగికి గుండె పరీక్ష చేస్తున్న నాగకిరణ్

పంగులూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గుండె ఆరోగ్య విషయంలో ప్రతివ్యక్తి తగిన జాగ్రత్తలు పాటించాలని విజయవాడ హెల్త్ హాస్పటల్స్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ నాగకిరణ్ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పంగులూరులో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బత్తుల వీరనారాయణ ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో పంగులూరు పరిసర గ్రామాలకు చెందిన 60 మందికి గుండె పరీక్షలు నిర్వహించి 12 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. ఈ వైద్యశిబిరంలో క్లబ్ కార్యదర్శి విశ్రాంత సైంటిస్ట్ రాయిణి రామారావు, పీఆర్‌వో సతీష్, క్లబ్ ప్రతినిదులు పెంట్యాల జగదీశ్వరరావు, కరణం హనుమంతరావు, షేక్ కాలేషావలి, గుర్రం ఆంజనే యులు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని మోటార్ సైకిలిస్టు మృతి



ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్సై షేక్ రఫీ

మేదరమెట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అనమనమూరు నుంచి మేదరమెట్ల వస్తున్న ట్రాక్టర్ మోటర్ సైకిల్‌ను ఢీ కొన్న ఘటనలో మోటర్ సైకిలిస్ట్ ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అనమనమూరుకు చెందిన పైయేద్దు ఏడుకొండలు(32) మేదరమెట్ల నుంచి స్కూటీపై అనమనమూరు వస్తుండగా మణికేశ్వరం నుంచి ఇసుకతో వస్తున్న ట్రాక్టర్ మలుపు వద్ద స్కూటీని ఢీ కొనడంతో స్కూటీతో సహా ఏడుకొండలు రోడ్డు అంచులో పడిపోయాడు. ఇసుక ట్రాలీ రోడ్డు మార్జిన్‌లో పడిన ఏడుకొండ లుపై బొల్తా పడింది. దీంతో ఏడుకొండలు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండు రోజుల క్రితం మేదరమెట్ల లో ప్రైవేట్ బస్సు ఢీ ఘటనలో ఏడుకొండలు మేనమామ సాంబశివరావు మృతిచెందాడు. ఒకే కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు

చీరాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని టూటౌన్ సీఐ నాగభూషణం పేర్కొన్నారు. ఆదివారం స్టేషన్ పరిధిలో ఓపెన్ డ్రంక్‌పై దాడులు చేశారు. ఈ సందర్భంగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం చీరాల రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకొంది. మృతుడు గులాబీ రంగు, నలుపు రంగు గీతల చొక్కా, నలుపు రంగు లోయర్ ధరించి ఉన్నాడు. చొక్కాకు బాంబే స్టయిల్స్ టీఎస్ఎల్ అని ఉంది. ఘటనపై రైల్వే ఎస్సై కొండయ్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ చార్జీల నిలువు దోపిడీని ఆపాలి

పర్చూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల నిలువు దోపిడిని ఆపాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య అన్నారు. ఆదివారం విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లు రద్దు తదితర అంశాలకు వ్యతిరేకంగా ఈనెల 5న సీపీఎం పార్టీ అధ్వర్యంలో తలపెట్టిన బందును సంబంధించిన కరపత్రాలను పర్చూరులో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల బిల్లులు మందుగానే వస్తున్నాయన్నారు. బిల్లులు చెల్లించలేక వినియోగ దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ప్రజలు, ప్రజా సంఘాలు పార్టీలకు అతీతంగా భారమైన కరంటు మీటర్లను వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.